
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 4 ఫిబ్రవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	230
సూర్యాపేట	రూ.131	182	212
నల్లగొండ	రూ.140	194	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 । కనిష్ఠం 18.0



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

» తొలి రోజు ఒక నామినేషన్ దాఖలు » ఎంసీఎంసీ సెంటర్ ప్రారంభం


నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలి రోజు ఒక నామినేషన్ దాఖలైంది.

నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మీడియాతో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 10 వరకు ఉదయం 11 మధ్యాహ్నం 3గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 8, 9 తేదీల్లో ప్రభుత్వ సెలవు కారణంగా నామినేషన్లు స్వీకరణ ఉండదన్నారు. దాఖలైన మొత్తం నామినేషన్లను ఈనెల 11న పరిశీలిస్తామని, 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు గడువు అని తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ నిర్వహిస్తామని, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు తాను రిటర్నింగ్ అధికారిగా, నల్లగొండ రెవెన్యూ అదనపు కలెక్టర్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తప్పకుండా ఎన్నికల కోడ్‌ను పాటించాలన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గ పరిధిలో మొత్తం 200 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ముసాయిదా జాబితా ప్రకారం 24,905మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ముందస్తు అనుమతి

- మిగతా 7వ పేజీలో...

నామినేషన్ కౌంటర్ 1వ రోజు

తేదీ	దాఖలైన నామినేషన్లు
3న	01
మొత్తం	01



కాషాయదళంలో.. అధ్యక్ష దుమారం

కాషాయం పార్టీలో జిల్లా అధ్యక్షుల ఎన్నికపై దుమారం చెలరేగుతోంది. ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లా అధ్యక్ష పదవులకు కీలకమైన నేతలు పోటీపడుతుండడంతో బాధ్యతలు ఎవరికివ్వాలనే విషయంలో అధిష్ఠాన ముఖ్యులు సైతం డైలమాలో పడ్డారు. వయో నిబంధనలు, రానున్న మూడేళ్లలో పార్టీ కార్యకలాపాలను విస్తృతస్థాయిలో జనంలోకి తీసుకెళ్లడం ద్వారా బలోపేతం చేసే శక్తి, సామర్థ్యాలు, కుల సమీకరణాలను పరిశీలిస్తున్న అధిష్ఠానం జిల్లాల అధ్యక్షుల నియమకంపై తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డిని ప్రకటించగా, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు సంబంధించి నాయకుల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. దీంతో ముఖ్యనేతలు సైతం ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో ఎవరికివ్వాలనే విషయంలో సందిగ్ధం కొనసాగుతుండగా, నాగం వర్షిత్‌రెడ్డి నియామకంపై పార్టీలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)


నాగం వర్షిత్‌రెడ్డి

» నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి వర్షిత్‌రెడ్డి
» నాగం నియామకంపై అభ్యంతరాలు
» పెండింగ్‌లో యాదాద్రి, సూర్యాపేట జిల్లాల అధ్యక్షుల నియామకాలు
» బలమైన పోటీతో నిర్ణయానికి రాలేకపోతున్న అధిష్ఠానం

పార్టీ రాష్ట్ర కమిటీ సోమవారం ప్రకటించిన జిల్లాల అధ్యక్షుల జాబితాలో నల్లగొండ అధ్యక్షుడిగా డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి పేరు మాత్రమే ఉండగా, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల అధ్యక్ష పదవులకు పేర్లను పెండింగ్‌లో పెట్టారు. నల్లగొండలోనూ అధ్యక్ష పదవికి తీవ్రపోటీ నెలకొన్నా చివరికి అధిష్ఠానం వర్షిత్‌వైపే మొగ్గింది. సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు తనయుడు సంకినేని వరుణ్‌రావు పేరు ఖరారైందని భావించినా, చివరలో ఆపేశారు. పార్టీ నిబంధనావళి ప్రకారం వయో పరిమితి సరిపోవడం లేదనే విషయం ప్రధాన ఆటంకంగా పేర్కొన్నట్టు సమాచారం. ఈ జిల్లా అధ్యక్ష పదవిని ఈ దఫా సూర్యాపేట పట్టణం లో ఉండి పార్టీలో క్రియాశీలకంగా ఉండే నాయకుల్లో ఎవరికైనా ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌ను నాయకులు అధిష్ఠానం ముందు పెట్టినట్టు తెలిసింది. ఈ జిల్లా అధ్యక్ష పదవికి సంకినేని వరుణ్‌రావు, కడియం రామచంద్రయ్య, బొబ్బ భాగ్య రెడ్డి, చలిగంటి వీరేంద్ర, చల్లా శ్రీలతారెడ్డి, చల్లమల్ల నరసింహ, బూర మల్సూరు గౌడ్, పలుసా మల్సూరుగౌడ్, తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇక్కడ ఎస్సీ సామాజికవర్గనేతకు జిల్లాఅధ్యక్ష పదవి ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించిన నేపథ్యంలో పేరును ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం.

యాదాద్రి జిల్లాలో ఊట్కూరి అశోక్‌గౌడ్, ఏసీరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, ఆలేరుకు చెందిన పడాల శ్రీనివాస్‌గౌడ్, మాయ దశరథ, తదితరులు అధ్యక్ష పదవి ఆశించి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో స్ర్కీనింగ్ కమిటీ ఊట్కూరి అశోక్‌గౌడ్, ఏసీరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి పేర్లను అధిష్ఠానానికి నివేదించగా, సామాజిక సమీకరణాల నేపథ్యంలో అశోక్ గౌడ్‌కు అధ్యక్ష పదవి ఖరారైందని భావించినా, చివరి నిమిషంలో ప్రకటించకపోవడం కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారింది.

వర్షిత్‌రెడ్డి నియామకంపై అభ్యంతరాలు...

నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి రెండోసారి నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు పార్టీ ఎన్నికల అధికారి ప్రకటన విడుదల చేశారు. ఈ సారి అధ్యక్ష పదవి కోసం వర్షిత్‌రెడ్డితో పాటు మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, దోనూరి వీరారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, కడగంచ రమేష్, పిల్లి రామరాజుయాదవ్, తూటుపల్లి రవీందర్ దరఖాస్తు చేసుకున్నారు. స్ర్కీనింగ్ కమిటీ వీరిలో వర్షిత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రమేష్ పేర్లను అధిష్ఠానానికి సూచించింది. రాష్ట్ర స్థాయి సమీకరణాల్లో భాగంగా వర్షిత్‌నే మరోదఫా అధ్యక్షుడిగా కొనసాగించాలని అధిష్ఠానం నిర్ణయించి ప్రకటించింది. అయితే వర్షిత్ నియామకాన్ని వ్యతిరేకిస్తున్న నాయకులు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఈ నియామకాన్ని వ్యతిరేకిస్తున్నామని, దీనిపై అధిష్ఠానం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. అధిష్ఠానం స్పందించకుంటే పార్టీ కార్యకలాపాలకు తాము దూరంగా ఉండాల్సి ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కేంద్ర...

- మిగతా 7వ పేజీలో...

పనుల జాతర

» ఖరారైన వార్షిక లక్ష్యం
» ఉమ్మడి జిల్లాలో 7.65లక్షల జాబ్‌కార్డులు
» 15.98లక్షల మంది కూలీలకు 1.85కోట్ల పనిదినాలు
» నిధుల అంచనా రూ.560కోట్లు


వేములపల్లి చెరువులో పూడికతీత పనులు చేపడుతున్న ఉపాధి కూలీలు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 3: గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను నియంత్రించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం కింద వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూలీలకు అత్యధిక పని దినాలు కల్పించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పిస్తూ 2025-26 ఆర్థిక సంవత్సర ప్రణాళిక ఖరైంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,85,44,021 పని దినాలను అధికారులు ఆమోదించారు. ఈ పనుల పూర్తికి దినసరి కూలీరేటు రూ.302 చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.560 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. దీంతో ఈ ఏడాది వేసవిలో గ్రామీణ ప్రాంత కూలీలకు అత్యధిక పనిదినాలు లభించనున్నాయి.

• 6లో..

• పాతగుట్టలో అధ్యయనోత్సవాలు ప్రారంభం


పాతగుట్టలో పూజలు నిర్వహిస్తున్న పండితులు

• 7లో..

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష

డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా ప్రభుత్వం వివక్ష చూపించిందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా టీపీసీసీ పిలుపు మేరకు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం క్లాక్ టవర్ సెంటర్‌లో పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్ కేటాయింపులో తెలంగాణపై వివక్ష చూపించిందని ధ్వజమెత్తారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఎక్కువ బడ్జెట్ కేటాయించిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయించకుండా పక్షపాతం చూపిందన్నారు. కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల, మతాల పేరుతో విడదీస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు, పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని అన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి వేల కోట్ల పన్నులు తీసుకొని బడ్జెట్లో తెలంగాణకి కేటాయించింది గుండు సున్నా అని అన్నారు. మోదీ మూడు సార్లు ప్రధాని అయినా పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి నిధులు కేటాయించాలనప్పటికీ కేంద్రం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, ప్రాంతీయ రవాణా శాఖ డైరెక్టర్ కుసుకుంట్ల రాజిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు గడిగ శ్రీను, బొజ్జ శంకర్, సమద్, కత్తుల కోటి, ఖలీల్, ఇంతియాజ్ హుస్సేన్, పోలే జయకుమార్, అల్లి సుభాష్‌యాదవ్, ఎండీ. ఇంతియాజ్, దుబ్బ అశోక్ సుందర్, బీరం కరుణాకర్‌రెడ్డి, ఇటికాల శ్రీనివాస్, ఇబ్రహీం, గురిజ వెంకన్న, వజ్జ రమేష్ యాదవ్, జూలకంటి వెంకట్, పుట్టా రాకేష్, వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పీఎం మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు గుమ్మల మోహన్‌రెడ్డి, తదితరులు

విద్యార్థినులు అన్ని అంశాల్లో ప్రతిభ కనబర్చాలి


కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ విద్యాలయాల విద్యార్థినులను విద్య, క్రీడలు, అన్ని అంశాల్లో రాణించేందుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కేజీబీవీల సూచించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేజీబీవీలోని విద్యార్థుల ఆహారం, విద్య, నిర్వహణ, తదితర అన్ని అంశాల్లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. జేఈఈ మెయిన్స్, ఎన్ఐటీ, నీట్ తదితర ఎంట్రన్స్ పరీక్షలకు వారిని సన్నద్ధం చేయాలన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు కోచింగ్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి ఐదుగురు విద్యార్థినులకు సైన్స్ ఎక్స్‌పోలకు తీసుకవెళ్లే విధంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. కేజీబీవీల అంతర క్రీడా పోటీలతోపాటు, జోనల్ స్థాయిలో నిర్వహించే క్రీడల్లో విద్యార్థినిలు ప్రతిభ కనబరిచే విధంగా తయారు చేయాలన్నారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఈవో భిక్షపతి, జీసీడీవో సరిత ఉన్నారు.

• భక్తి శ్రద్ధలతో వసంత పంచమి


నల్లగొండలో వసంత పంచమి సందర్భంగా చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న దంపతులు

నియమావళికి విరుద్ధంగా అధ్యక్షుడి నియామకం

బీజేపీ నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ నియమావళిని ఉల్లంఘించి జిల్లా అధ్యక్ష నియామకం జరిగిందని, దీనిపై కేంద్ర నాయకత్వం పునరాలోచించాలని బీజేపీ నల్లగొండ పార్లమెంటరీ కన్వీనర్ బండారు ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒంటెద్దు పోకడలతో క్రియాశీల సభ్యత్వం లేని వారిని అధ్యక్షుడిని ఎలా చేస్తారని ప్రశ్నించారు. 11 నెలలుగా జిల్లా అధ్యక్షుడిగా ఉండి పేమెంట్ కార్యకర్తలతో నడిపిస్తూ, పార్టీని భ్రష్టు పట్టించిన వ్యక్తికి మరోసారి పదవి ఎలా ఇస్తారన్నారు. వర్షిత్‌రెడ్డి నియామకాన్ని జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, వారి అభిప్రాయం తీసుకోకుండా ఎలా నియామకం చేస్తారని ప్రశ్నించారు. క్రమశిక్షణ ఉన్న కార్యకర్తగా, నాయకుడిగా బీజేపీ నిబంధనలకు కట్టుబడి పనిచేశానని తొలిసారి పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించడం బాధగా ఉందన్నారు. బూతు కార్యకర్తలు, మండల పార్టీ నాయకులు, జిల్లా నాయకులు అభిప్రాయం తీసుకోకుండానే నియామకం చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

అధ్యక్షుడిని మార్చకుంటే కార్యాలయానికి వచ్చేది లేదు

పార్టీ రాష్ట్ర నాయకత్వం అధ్యక్ష నియామకంపై పునరాలోచన చేయాలని అన్నారు. పార్టీ అధ్యక్ష మార్పు జరిగేంతవరకు పార్టీ కార్యాలయ మెట్లు ఎక్కేది లేదని స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తామని, అయినా పట్టించుకోకపోతే తామంతా ఒక నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని, ఆ పరిస్థితి రాకుండా చూడాలన్నారు. బీజేపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతెపాక సాంబయ్య మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అర్ధరాత్రి నియామకం జరిగిందని, మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం తీసుకోలేదని, పార్టీ కేంద్ర నాయకత్వం పునరాలోచన చేయాలని అన్నారు. సీనియర్ కార్యకర్తలను పక్కనపెట్టి పార్టీని భ్రష్టు పట్టిస్తున్న వ్యక్తికి అధ్యక్ష పదవి ఎలా కట్టబెడతారన్నారు. తనతో కలిసి రాకపోతే ప్రస్తుత కౌన్సిలర్లతోపాటు, కౌన్సిలర్ టికెట్ ఆశిస్తున్న వారికి టికెట్ ఇచ్చేది లేదని బెదిరిస్తూ పార్టీకి నష్టం చేసే చర్యలు చేపడుతున్నాడని అన్నారు. అలాంటి వ్యక్తి అధ్యక్షుడిగా కొనసాగితే ఇప్పుడిప్పుడే జిల్లాలో పుంజుకుంటున్న పార్టీ అధోగతి పాలవుతుందని ఆదేవన వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు కంకణాల నాగిరెడ్డి, దాసరి సాయి, వంగూరు రాఖీ, గుర్రం వెంకన్న, రావిరాల వెంకటేశ్వర్లు, గడ్డం వెంకట్‌రెడ్డి, వినయ్‌కుమార్, ఈశ్వర్, బద్దం నగేష్, అక్కినపల్లి బలరాం, బొజ్జ నాగరాజు, మధు, పెరిక నరసింహ, పెరిక మునికుమార్, ముత్యాల శంకర్‌రెడ్డి, పవన్, ఏరుకొండ హరి, సముద్రాల వెంకట్, ప్రసాద్ భిక్షం, తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండారు ప్రసాద్


జోన్‌ల వారీగా సిబ్బందికి డ్యూటీలు కేటాయిస్తున్న అధికారులు

చెర్వుగట్టు జాతరలో 530 మందితో పారిశుధ్య సేవలు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు జాతర సందర్భంగా 530మందితో పారిశుధ్య సేవలు అందించనున్నారు. చెర్వుగట్టు గ్రామాన్ని మొత్తం 10 పారిశుధ్య జోన్లుగా, ఎనిమిది తాగునీటి జోన్లుగా విభజించారు. ప్రతిరోజూ మూడు షిఫ్టుల ప్రకారం సిబ్బంది అందుబాటులో విధులు నిర్వహించనున్నారు. జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షణలో ఆరుగురు ఎంపీడీవోలు, ముగ్గురు డీఎల్‌పీవోలు, 10 మంది ఎంపీవోలు, 90మంది పంచాయతీ కార్యదర్శులు వారం రోజుల పాటు జాతర విధుల నిర్వహించనున్నారు. 411 మంది పారిశుధ్య సిబ్బంది మూడు షిఫ్టుల్లో సేవలందించే విధంగా ఏర్పాట్లు చేశారు. వీరిలో 75 మంది గ్రామపంచాయతీ వర్కర్లు కాగా, మిగతా 336మంది దినసరి కూలీలను నియమిస్తారు.

ఎప్పటికప్పుడు చెత్త ఎత్తివేసేలా ఎనిమిది ట్రాక్టర్‌లు, ఎనిమిది జోన్‌లలో తాగునీటిని నిరంతరం సరఫరా చేసేలా 10 ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. ఈ సారి మూడు మొబైల్ టాయిలెట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో మొబైల్ టాయిలెట్లలో 10 బ్లాకులుంటాయి. జాతర ముగిసే వరకు ప్రతిరోజూ సుమారు 550 నుంచ 600 మందికి మూడు పూటలా ఆహారాన్ని సరఫరా చేసేందుకు టెండర్ ద్వారా ఏర్పాటు చేశారు.

మొదటి రోజే భారీగా గైర్హాజరు

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం • 6లో..

కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటుచేయాలి


మోత్కూరులో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, పైళ్ల సోమిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోత్కూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సామేలు కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్న నాయకులను, ఆయన గెలుపు కోసం పని చేసిన వారిని పక్కనపెట్టి, బీఆర్ఎస్ నుంచి వచ్చి పార్టీ కండువా కప్పుకున్న వారిని ప్రోత్సహిస్తున్నారని, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటుచేసేంతవరకు తాము పోరాడుతామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యానారాయణ, పలువురు కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. సోమవారం యాదాద్రి జిల్లా మోత్కూరులో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి సన్మాన సభలో వారు మాట్లాడారు. ముందుగా ప్రీతం మాట్లాడుతూ, 35 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసి, ఈ ప్రాంతంలో పార్టీని, కార్యకర్తలను కాపాడిన పైళ్ల సోమిరెడ్డికి వాస్తవంగా నామినేటెడ్ పోస్టు రావాలని, అది ఇవ్వలేనప్పుడు పార్టీ పదవి ఇస్తే జీర్ణించుకోలేకపోతే ఎలా అని ప్రశ్నించారు. కార్యకర్తల జోలికి వస్తే పదవిని పక్కన బెట్టి వారికి అండగా నిలుస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ ఇస్తారో లేదోనని భయపడవద్దని అన్నారు.

పనుల జాతర

గ్రామీణప్రాంత కూలీల వలసలు నియంత్రించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో దండిగా 'ఉపాధి' కల్పించబోతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జాబ్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి 100 రోజుల పనిదినాలు చూపేందుకు వార్షిక అంచనా ప్రణాళిక ఖరారైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రవేశపెట్టిన నేపథ్యంలో కూలీల సంఖ్య పెరగడంతో పాటు పనిదినాలు పెరిగే అవకాశం ఉంది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్)



గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకం నిధులతో డంపింగ్‌యార్డ్, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్, హార్టికల్చర్ ప్లాంటేషన్ వంటి స్థిరాస్తులు సృష్టించి పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీల్లో వననర్సరీ ఏర్పాటు, పశుల షెడ్, పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు వినియోగం జరుగుతోంది. అంతేగాకుండా కూలీల పనిదినాల ఆధారంగా మంజూరైన గ్రామీణా అభివృద్ధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 2025-26 వార్షికంలోనూ ప్రణాళిక ప్రకారం నిర్ణీత లక్ష్యాన్ని పూరించేందుకు ఆ శాఖ అధికారులు సమాయత్తమవుతున్నారు.

అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం

గ్రామీణాభివృద్ధిశాఖ వార్షిక లక్ష్యాన్ని ఖరారు చేసింది. అక్టోబరు 2న పనుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించి డిసెంబరులో పూర్తి ఆయా పనులకు వార్షిక ప్రణాళికలో అనుమతులు పొందారు. దీంతో గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతీ కుంటుంబానికి 100 రోజుల పనిదినాలను క్షేత్రసహాయకులు కల్పించనున్నారు. దీంతో గ్రామాల్లో చెరువుల పూడికతీత, కందకాల తవ్వకం, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే మట్టిరోడ్ల మరమ్మతులు, పంటల కాల్వల పూడికతీత, చెట్లపెంపకం, బీడుభూముల చదును, చేపల చెరువు తవ్వకాలు తదితర అభివృద్ధి పనులకు తొలిప్రాధాన్యం కల్పించారు. వేసవిలో ఈ పనులను ముమ్మరంగా కొనసాగించేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే నిబంధనల మేరకు పనులు నిర్వహించడం లేదన్న అంశాన్ని గతేడాది జూన్‌లో రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర ప్రతినిధి బృందం నివేదిక రూపంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు అందజేసింది. దీంతో నిధుల దుబారాను అరికట్టి అభివృద్ధి పనులకే ప్రాధాన్యం కల్పించాలన్న ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో పనులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నివిభాగాల అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీచేశారు.

ఖరారైన వార్షిక లక్ష్యం

ఉపాధిహామీ పథకం వార్షిక ప్రణాళికను గ్రామీణాభివృద్ధిశాఖ ఖరారు చేసి నివేదికను సీఆర్డీకి పంపింది. 2025-26 వార్షికానికి 1,85,44,021 పనిదినాలతో కూడిన పనులను గుర్తించి, ఆమోదించారు. దినసరి కూలీరేటు రూ.302 లెక్కన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.560కోట్లు అవసరమని అంచనా వేశారు.

● నల్లగొండ జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 89,13,595 పనిదినాలతో రూ.269కోట్లు, సూర్యాపేట జిల్లాకు 63,97,370 పనిదినాలకు రూ.193కోట్లు, యాదాద్రిభువనగిరి జిల్లాకు 32,33, 056 పనిదినాలతో రూ.97 కోట్లు ఖర్చుచేయాల్సి ఉంది. మొత్తంగా నూతన ఆర్థికసంవత్సరానికి ఉమ్మడి జిల్లాకు రూ.560కోట్ల అంచనా వ్యయంతో 1,85,44,021 పనిదినాలు మంజూరయ్యాయి.

గతేడాది పనిదినాల వినియోగంలో సూర్యాపేట జిల్లా ప్రథమస్థానంలో నిలిస్తే ఆ తరువాత నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లాలు ఉన్నాయి. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి సూర్యాపేట జిల్లాకు 1.20లక్షల పనిదినాలు తగ్గించగా, నల్లగొండ జిల్లాకు 6.91లక్షల పనిదినాలు అధికంగా లభించడం గమనార్హం. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలకు వచ్చే వార్షిక ఏడాదికి 24వేల స్వల్పతేడాతో పనిదినాల మంజూరు జరిగితే ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వచ్చే ఆర్థికసంవత్సరానికి 5,46,262పనిదినాల సంఖ్యపెరగగా, గ్రామీణ కూలీలకు దండిగా ఉపాధిపనులు లభించనున్నాయి.

పెరగనున్న కూలీల హాజరుశాతం

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అమల్లోకి తెచ్చిన ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం లబ్ధిదారుల ఎంపికలో ఉపాధి జాబ్‌కార్డు కలిగి ఉండి కనీసం 20రోజులు పనికి హాజరై ఉండాలన్న నిబంధన పెట్టింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది కూలీల హాజరుశాతం మెరుగుపడే అవకాశం ఉంది. ఇప్పటివరకు జాబ్‌కార్డు కలిగి ఉండి అంతగా ఉపాధి పనులకు హాజరుకాలేని కుటుంబాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధి కోసం ఈ ఏడాది పథకాన్ని ఆదరించే అవకాశం లేకపోలేదు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో కూలీల సగటు హాజరు 77.72శాతంగా నమోదై ఉంటే వచ్చే ఏడాది 85శాతానికిపైగా నమోదు కావచ్చని భావిస్తున్నారు.

హాజరునమోదులో పర్సన్ రికగ్నేషన్

కూలీల హాజరునమోదులో అవకతవకలను అరికట్టేందుకు కేంద్రగ్రామీణాభివృద్ధిశాఖ చర్యలు చేపట్టింది. ఇక నుంచి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్ఎంఎంఎస్) హాజరునమోదు పారదర్శకంగా ఉండబోతోంది. ఉదయం, సాయంత్రం వేళలో కూలీ హాజరు నమోదులో పర్సన్ రికగ్నేషన్‌ను బట్టి ఎన్ఎంఎంఎస్ పోర్టల్ స్వతహాగా స్కాన్‌చేసుకొని హాజరు ఎన్‌రోల్ చేస్తోంది. దీంతో మస్టర్‌రోల్‌లో హాజరైన కూలీల సంఖ్యను బట్టి ముఖాలు కనిపించేలా క్షేత్రస్థాయి సిబ్బంది ఫొటో క్యాప్చర్ చేయాల్సి ఉంటుంది. కూలీల ముఖంపై చెమటపట్టినా, వరుసలో సరిగ్గా కనిపించకపోయినా హాజరు తీసుకోవడం లేదని క్షేత్రసహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మస్టర్ ఉదయం హాజరు నమోదులో కూలీల రికగ్నేషన్‌కు 5-10 నిమిషాల వరకు సమయం పడుతుందని, ఇదే పరిస్థితి ఉంటే వేసవిలో హాజరునమోదులో ఇబ్బందులు తప్పేలా లేదని క్షేత్రసహాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో

జిల్లా	జాబ్‌కార్డులు	కూలీలు	పనిదినాలు	పూర్తిచేసినవి	ఖర్చు(కోట్లలో)	శాతం
నల్లగొండ	3,59,768	7,64,390	82,22,218	63,88,894	రూ.193	77
సూర్యాపేట	2,62,632	5,70,256	65,17,562	51,12,894	రూ.154	78.45
యాదాద్రి	1,43,239	2,63,481	32,57,979	24,87,832	రూ.75	76.36

లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి



వచ్చే వార్షిక లక్ష్యానికి చేరువయ్యేందుకు సమష్టిగా కృషి చేస్తాం. జిల్లాకు గత ఏడాది కంటే దాదాపు ఏడు లక్షల పనిదినాలు పెరిగాయి.అదేస్థాయిలో పనులను గుర్తించి ఆమోదించడం జరిగింది. 2024-25 బడ్జెట్‌లో 77.70శాతం పూర్తిచేసి కూలీల ఖాతాలో వేతనాలు పూర్తిగా వేశాం. ప్రతీ కుటుంబానికి ఉపాధి చూపాలని అధికారులను, క్షేత్ర సహాయకులను ఆదేశించాం. కొలతల ప్రకారం నిర్ణీత సమయం వరకు పనిచేసి కూలీలు దినసరి వేతనం పొందాలి.

- శేఖర్‌రెడ్డి (డీఆర్‌డీవో నల్లగొండ)

వేసవిభత్యం పునరుద్ధరించాలి



ఉపాధి పథకంలో రద్దు చేసిన వేసవిభత్యాన్ని పునరుద్ధరించాలి. మండుటెండలో పనులకు వెళ్తే కొలతల ప్రకారమే వేతనాలు అందుతున్నాయి. వేసవిభత్యం అమలుచేస్తే చేసిన పనిరేటుకు దాదాపు 30శాతం అదనపు కూలి దక్కుతుంది. పార, గడ్డపార, టెంట్, మెడికిట్లు వంటి సౌకార్యాలు కూలీలకు కలిపించాలి. గతంలో చెల్లించిన మంచి నీరు, గడ్డపార బిల్లులు తొలగించడంతో కూలీలకు గిట్టుబాటు కావడంలేదు. ప్రభుత్వాలు ఆలోచనచేసి గత అలవెన్సులను అందించాలి.

- షేక్ అమీనా, ఉపాధి కూలీ, వేములపల్లి

రెండుపూటల నిబంధన తొలగించాలి



ఉపాధి పనులకు రెండు పూటలా హాజరు కావాలన్న నిబంధన తొలగించాలి. వేసవిలో రెండు పూటలు పనిచేయడం కష్టమవుతోంది. పనివేళలో మార్పులు చేయడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలి. వేతనాల చెల్లింపులో జాప్యం జరుగకుండా చూడాలి. ఒక్కోసారి నెల దాటినా కూలి డబ్బులు అందడం లేదు. అలాంటి పరిస్థితి రాకుండా 10 రోజుల్లో వేతనాలు అందేలా చర్యలు ఉండాలి.

- చిట్యాల ఎల్లమ్మ, ఉపాధి కూలీ, కల్వెలపాలెం

ఏఐ ఆధారిత బోధన మంచిదే

ప్రభుత్వ పాఠశాలలో ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహకారంతో వర్చువల్ రియాలిటీ(వీఆర్) విధానంలో పాఠాలు చెప్పేలా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. మానవ సహజ మేధస్సును మించి ఆలోచించే యంత్ర జ్ఞానమే ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్(ఏఐ). పరిస్థితులకు అనుగుణంగా స్పందిస్తూ విద్యార్థుల్లో అభ్యసనను పెంచేలా ఉపకరిస్తుంది. దీని సహాయంతో విద్యార్థులు నేర్చుకున్న పాఠంతాలుకా విషయ పరిజ్ఞానాన్ని వాస్తవికత రూపంలో(ఏఐ ద్వారా) తెలుసుకోవచ్చు. వచ్చే విద్యా సంవత్సరంలో అమలు చేసి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానాన్ని పెంచేందుకు యత్నాలు చేస్తున్నారు. ఈ ఏఐ పరిజ్ఞానంతో విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగి మంచి ఫలితాలు వస్తాయంటున్నా ఉపాధ్యాయులు.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)


● ఏఐతో మెరుగైన బోధన



ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ కంటే మెరుగైన విద్యాప్రమాణాలు నెలకొల్పాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అందుకు ఏఐ టెక్నాలజీతో విద్యాబోధన అందించాలని కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ కార్యాచరణ పూర్తయితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రానున్న రోజుల్లో వచ్చే సాంకేతికతను అందిపుచ్చుకోవటంలో ముందు వరుసలో ఉంటారు.

ఆర్ రామనర్సయ్య, ఉపాధ్యాయుడు


● కళ్లముందు కనిపిస్తున్నట్లే ఉంటుంది



తరగతి గదిలో బోధన చేసిన విషయాన్ని ల్యాబ్‌లో సాంకేతికత సహాయంతో టీవీ స్క్రీన్‌పై చూడొచ్చు. ఫలితంగా విద్యార్థిలో విషయ పరిజ్ఞానం మరింత పెరుగుతుంది. ఉదాహరణకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు గురించి తరగతి గదిలో విన్న పాఠం ఏఐ సహాయంతో టీవీ స్క్రీన్‌పై చూపిస్తాం. దీంతో కళ్లముందే విద్యార్థికి ప్రాజెక్టు నిర్మాణం జరిగినట్లు కనిపిస్తుంది. ఫలితంగా విద్యార్థిలో విషయ పరిజ్ఞానం పెరగడమే కాక, మేథోసంపత్తి పెరుగుతుంది.

గండికోట పవన్‌కుమార్, ఉపాధ్యాయుడు

● విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుంది



ఏఐ, వీఆర్‌ల సాంకేతికతలు చరిత్ర నేర్చుకోవడమే కాక, గణిత నైపుణ్యాలు మెరుగుపర్చడానికి ఉపయోగపడతాయి. విద్యార్థుల్లో సొంతంగా సాంకేతికత ఉపయోగించే అలవాటు పెరుగుతుంది. టీచర్ చెప్పిన పాఠం అనంతరం ఏఐ ఆధారిత ప్రశ్నలు గూగుల్ క్రోం ద్వారా విద్యార్థులకు పంపుతారు. వారు సమాధానాలు ఆన్‌లైన్‌లో వెతకాల్సి ఉంటు ంది. విద్యార్థి వెతికే సమాధానం తప్పయితే తప్పు సరి చేసుకునే వరకు ఏఐ టెక్నాలజీ విద్యార్థికి సూచనలు చేస్తుంది. ఫలితంగా టెక్నాలజీపై పట్టుతో పాటు అభ్యాసనంపై విద్యార్థులు పట్టు సాధిస్తారు.

చందా శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు

● మంచి ఫలితాలకు అవకాశం



5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఏఐ ఆధారిత బోధన ఉంటుందని అధికారులు అంటున్నారు. సిలబస్ దృష్టిలో ఉంచుకొని ప్రోగ్రామ్స్ రూపొందించి, కంప్యూటర్లకు ఇంటర్నెట్ అనుసంధానం చేసి,ఏఐ సహాయంతో బోధనకు సంబంధించి ప్రయోగాత్మకంగా చెప్పడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు, అంతేకాక ఏఐతో విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. అయితే ఏఐ ద్వారా బోధన చేసేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే విద్యార్థులకు ఏఐ ద్వారా న్యాయం జరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

బడుగుల సైదులు, ఉపాధ్యాయుడు

సరస్వతీ నమస్తుభ్యం...





అవంతీపురంలో కల్యాణోత్సవం, నల్లగొండలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో అక్షరాభ్యాసానికి చిన్నారులతో హాజరైన తల్లిదండ్రులు

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని అవంతీపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి శాంతికల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ప్రతి ఏడాది వసంత పంచమిని పురస్కరించుకుని సరస్వతి ఆలయంలో నిర్వహించే అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరభ్యాసాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించిన ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అవంతీపురంలో నిర్వహించిన శాంతికల్యాణ మహోత్సవం, సరస్వతీదేవి పూజా కార్యక్రమాలకు పట్టణ, మండల పరిసర ప్రాంతాల భక్తుల రాకతో జాతర వాతావరణం నెలకొంది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు, రూరల్ పోలీసులు ఏర్పాట్లు చేపట్టారు.

ఘనంగా శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి వేడుకలు

నల్లగొండ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పర్వదినం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకస్వాములు అమ్మవారికి తెల్లవారుజామున నుంచే అభిషేకాలు, పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేశారు. రామగిరి సీతారామచంద్రస్వామి దేవాలయం, తులసీనగర్ భక్తాంజనేయస్వామి దేవాలయం, షేర్ బంగ్లా సంతోషిమాతా ఆలయం, వీటీకాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాలతో పాటు పానగల్లులోని పచ్చల, ఛాయ సోమేశ్వరాలయాల్లో వసంత పంచమి వేడుకలను కన్నులపండుగగా నిర్వహించారు. అనంతరం చిన్నారుల చేత సామూహికంగా అక్షరాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఆలయాన్ని భక్తులతో, చిన్నపిల్లలతో సందడి చేశా యి. ఆయా కార్యక్రమాల్లో అర్చక స్వాములు కారంపూడి మోహన్‌శర్మ, పవన్‌శర్మ, యాదగిరిశర్మ పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యను అందించాలి

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని శ్రీసరస్వతీ విద్యానిలయం పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు ఒంటెద్దు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతీ విద్యానిలయం పాఠశాలలో నిర్వహించిన వసంత పంచమి వేడుకల్లో ఆయన మాట్లాడారు. మాఘశుద్ధ పంచమిని పురస్కరించుకుని 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభం కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం 150 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, గుండా రమేష్, కొత్త మల్లికార్జున్, లక్ష్మీనారాయణ, హైమావతి, గజ్జల వెంకటరెడ్డి, పర్వతం శ్రీధర్, శ్రీనివాస్, మురళీధర్‌రెడ్డి, నరేంద్రరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

మామను కొట్టి నెట్టేసిన కోడలు

● సీసీరోడ్డుకు తల తగిలి మృతి

● నల్లగొండ జిల్లా డిండిలో ఘటన



డిండి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మామను కర్రతో కొట్టిన కోడలు నెట్టివేయడంతో సీసీరోడ్డుపై పడి తలకు గాయమై మృతిచెందాడు. ఆదివారం రాత్రి నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... గోనబోయినపల్లి గ్రామానికి చెందిన బద్దె రాములు(65)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా వీరికి వివాహాలు అయ్యాయి. ఇద్దరు కుమారులు ఒకే ఇంట్లో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు బద్దె పెద్దయ్య మూగవాడు కాగా, కోడలు పెద్దులమ్మకు సరిగా వినపడదు. కుమారుడు, కోడలు కూలిపనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు అప్పుడప్పుడు మద్యం తాగి ఇంటికి వస్తుండటంతో సరిగా చూసుకోవడం లేదని కోడలు పెద్దులమ్మను మామ రాములు ప్రశ్నించాడు. తరచూ మామ రాములుతో పెద్దులమ్మ గొడవ పడుతుండేది. ఆదివారం రాత్రి రాములుతో గొడవపడిన పెద్దులమ్మ కర్రతో కొట్టి నెట్టివేయడంతో ఆయన సీసీ రోడ్డుపై పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై రాములు భార్య జంగమ్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దొంగతనం కేసులో ఒకరు అరెస్ట్

వేములపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటు పడి దొంగతనానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా వేములపల్లి రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ డీ వెంకటేశ్వర్లు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం వేములపల్లి మండలకేంద్రానికి చెందిన పోల కల్పన అనే వితంతువు ఇంట్లో పిండి మిల్లు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. గత నెల 2న కల్పన ఆరోగ్యం బాగా లేకపోవడంతో నాగర్‌కర్నూల్‌లోని తన తల్లిగారింటికి వెళ్లింది. ఆ సమయంలో ఆమె ఇంటికి ఎదురుగా ఉంటున్న దాసోజు నరేష్ కుమార్ అదే రోజు రాత్రి ఆమె ఇంట్లోకి వెళ్లి రూ.20వేల నగదు 1.6గ్రాముల చంద్రహారం, ఆరుగ్రాముల ఉంగరాలు, నాలుగు గ్రాముల చెవిదిద్దులను చోరీచేశాడు. బంగారు వస్తువులను ఇంట్లో దాచి, నగదును జల్సాలకు ఖర్చు చేసి తిరిగి ఇంటికి వచ్చాడు. సోమవారం ఇంట్లో దాచిన బంగారు వస్తువులను తీసుకుని సూర్యాపేటలో విక్రయించేందుకు బయలుదేరాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం శెట్టిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద అనుమానస్పదంగా నిలబడి ఉండగా అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాన్ని ఒప్పుకుని బంగారు ఆభరణాలను అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి బంగారు ఆభరణాలతోపాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపించినట్లు వారు తెలిపారు.

మొదటి రోజే భారీగా గైర్హాజరు

● ఇంటర్ ఒకేషనల్, జనరల్ విద్యార్థులకు ప్రారంభమైన ప్రాక్టికల్స్ పరీక్షలు

● ఉమ్మడి జిల్లాలో 942 మంది డుమ్మా



భువనగిరిలో ఒకేషనల్ పరీక్షను పరిశీలిస్తున్న నోడల్ అధికారి రమణి

నల్లగొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు తొలిరోజే విద్యార్థులు భారీగా గైర్హాజరయ్యారు. సోమవారం నుంచి ఒకేషనల్, జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 942 విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ, ప్రైవేట్, కస్తూర్బా, మోడల్ స్కూళ్లతో పాటు గురుకుల జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు రెండు పూటలా పరీక్షలు నిర్వహించారు.

నల్లగొండ జిల్లాలో

నల్లగొండ జిల్లాలో మొత్తం జనరల్, ఒకేషనల్ విభాగంలో కలిపి 446 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన జనరల్ విభాగంలో 1,257 మందికి గాను 1,214 మంది హాజరు కాగా 43 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,375 మంది విద్యార్థులకు 1161 మంది హాజరు కాగా 211 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన జనరల్, ఒకేషనల్ విభాగాల్లో ప్రయోగ పరీక్షకు విద్యార్థులు 2012 మందికి 1,915మంది హాజరు కాగా 96మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 833 మంది విద్యార్థుకు గాను 820మంది హాజరయ్యారు. 12మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,179మంది విద్యార్థులకు 1095మంది హాజరు కాగా 84 మంది గైర్హాజరయ్యారు.

యాదాద్రిభువనగిరి జిల్లాలో

భువనగిరి టౌన్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 42 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ జనరల్, ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగింది. మొదటి రోజు 115 మంది గైర్హాజరయ్యారు. జనరల్ ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో 586 మందికి గాను 579 మంది హాజరు కాగా 7 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షలకు 1,564 మందికి గాను 1456 మంది హాజరు కాగా 108 మంది గైర్హాజరయ్యారు. అయితే ఈ నెల 3 నుంచి 22 వరకు మూడు దఫాలుగా రెండు పూటలా జరుగనున్న ప్రాక్టికల్స్‌కు జనరల్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు 6,200మంది హాజరు కావాల్సి ఉంది. ఇంటర్ నోడల్ అధికారి సీ రమణితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, జిల్లా పరీక్షల విభాగం అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

సూర్యాపేట జిల్లాలోనూ...

భానుపురి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లాలో ప్రాక్టికల్స్ పరీక్షలకు 381 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 44 కేంద్రాలను కేటాయించగా అందులో 7 ప్రభుత్వ 15 ప్రభుత్వ రంగ సంస్థల్లో, 22 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు ఒకేషనల్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 1086 మంది హాజరుకావాల్సి ఉండగా 872 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. 214 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 918 మందికి 883 మంది మాత్రమే పరీక్షకు హాజరు కాగా 35 మంది హాజరు కాలేదు. మధ్యాహ్నం ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 985 మందికి 888మంది హాజరు కాగా 97 మంది ప్రాక్టికల్స్ రాయలేదు. జనరల్ విద్యార్థులు 718 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 683 మంది మాత్రమే రాశారు. 35 మంది ప్రాక్టికల్స్‌కు గైర్హాజరయ్యారని సూర్యాపేట జిల్లా అధికారి భానునాయక్ తెలిపారు.

ఉపకాల్వలో పడి వ్యక్తి మృతి



గోవింద్‌యాదవ్(ఫైల్‌ఫొటో)

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఉపకాల్వలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని తిరుమలగిరి నుంచి పులిచర్లకు వెళ్లే మార్గంలో సోమవారం జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గుండాల గోవింద్‌యాదవ్(50) సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్వగ్రామం ఎల్లాపురం నుంచి అదేగ్రామానికి చెందిన బొమ్ము అంజయ్యతో కలిసి తన స్కూటీపై అంగడిపేట ఎక్స్‌రోడ్డుకు బయలుదేరారు. పులిచర్ల గ్రామం నుంచి తక్కువ దూరం ఉండడంతో డీ-8 కాల్వకట్ట మీదుగా వస్తున్నారు. మార్గమధ్యలో గుంతలు ఉండడంతో స్కూటీ అదుపు తప్పి కాల్వలోకి దూసుకపోయింది. దీంతో ఇద్దరు కాల్వలో పడిపోయారు. గోవింద్ యాదవ్ తల వెనుక భాగం కాల్వ ఆర్‌సీసీకి బలంగా తగలడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి అంజయ్య కాల్వలో ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుని కేకలు వేశాడు. చుట్టుపక్కల వాళ్లు వచ్చి గోవింద్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. వెంటనే కుటుంబ సభ్యులకు, గుడిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ మార్చురీకి తరలించారు. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వంగపల్లి రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం రైల్వే పోలీసులకు లభ్యమైంది. స్థానిక రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి రైల్వే ప్లాట్‌ఫాం నెంబరు 2/కేఎంఎస్‌వో 252/4-6 వద్ద కాలినడక వంతెనకు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (55) వయస్సు కలిగిన ఛామన ఛాయ రంగు కలిగిన మృతదేహం లభ్యమైంది. అతడి ఒంటిపై తెల్లని చొక్కా, నల్లని గీతల ప్యాంట్, తెలుపు, నలుపు రంగు కలిగిన స్వెటర్ ఉన్నాయి. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చామని, ఆనవాళ్లు గుర్తిస్తే 9848222169, 8712568454 ఫోన్‌నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

సీనియర్ కబడ్డీ జట్టుకు ఎంపిక

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే నల్లగొండ జిల్లా సీనియర్ కబడ్డీ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్. భూలోకరావు, కర్తయ్య తెలిపారు. ఈ జట్టు ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్‌లో జరిగే తెలంగాణ సీనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ గుడిపల్లి మండలం జీ. భీమనపల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి కళాచారి ఎంపికైయ్యారు.

చికెన్ ముక్క కోసం పంచాయితీ

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒక చికెన్ ముక్క రెండు గ్రామాల మధ్య వివాదానికి తెరలేపింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలోని ఒక చికెన్ దుకాణంలో మరో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వారం కిందట చికెన్ కొనుగోలు చేశాడు. చికెన్ ముక్క వినియోగదారుడు కోరిన విధంగా షాపు నిర్వాహకుడు ఇవ్వలేదని ఘర్షణ మొదలై చికెన్ కొన్న యువకుడిపై షాపు నిర్వాహకుడు దాడి చేశాడు. వినియోగదారుడికి తలకు గాయాలు కాగా వినియోగదారుడు తరుపున బంధువులు, స్నేహితులు చికెన్‌షాపు నిర్వాహకుడిపై దాడి చేశారు. దీంతో రెండు గ్రామాల మధ్య పంచాయితీ మొదలై పెద్దమనుషుల జోక్యంతో చికెన్‌షాపు నిర్వాహకుడికి జరిమానా విధించారు. దీంతో వివాదం సమసిపోయింది. ఘటనపై ఎస్ఐని వివరణ కోరగా ఈ విషయంపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని తెలిపారు. కాగా ఘటన జరిగి ఐదు రోజులు గడిచింది.

ఫీజు బకాయిలను
వెంటనే విడుదల చేయాలి

బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బకాయి ఉన్న రూ.4600 కోట్ల రూపాయలను ఫీజులను తక్షణమే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల బలిదానాలు, పోరాటాలతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాకారంతోనే కేసీఆర్, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. సీఎం పీఠం మీద కూర్చున్న తర్వాత తెలంగాణ కోసం పోరాడిన విద్యార్థులను విస్మరించారని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అవుతున్నా బీసీ ఎస్సీ ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో బకాయి ఉన్న రూ.4600 కోట్లను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో చదివే విద్యార్థుల పూర్తి మెస్ బిల్లులను ప్రభుత్వమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు నర్సింగ్ శివకుమార్, కన్నబోయిన పరమేష్‌యాదవ్, శంకర్, ఏర్పుల శ్రవణ్, మహేష్, పృథ్వీరాజ్, మణికంఠ, సతీష్ ,హరికృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వేణు ప్రతిభ

నల్లగొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గాలం వేణు ఎంపికైనట్లు ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాబు గిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీలకు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో దామరచర్ల మండల కేంద్రానికి చెందిన గాలం వేణు జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ జట్టు తరపున సౌత్ జోన్ కబడ్డీ పోటీలు పాల్గొని ప్రతిభ కనబర్చారని, జూనియర్, సీనియర్స్ విభాగంలో పలు పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకున్నాడని తెలిపారు.

బీసీ ఉపాధ్యాయ సంఘం
రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శంకర్‌గౌడ్


శంకర్‌గౌడ్

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కన్నే శంకర్ గౌడ్ నియమితులయ్యారు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బీసీటీయూ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నియామక పత్రాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్‌రావు అందజేశారు. బీసీ ఉపాధ్యాయ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, బీసీ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.వీరప్ప, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వైపాల కృష్ణ, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వినోద్, బీసీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పాపిరెడ్డి


పాపిరెడ్డి

కనగల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చినమాదారం గ్రామానికి చెందిన పింపి పాపిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర కమిటీకి ఎన్నికైన పాపిరెడ్డికి పలువురు మండల నాయకులు అభినందించారు. తన ఎన్నికకు సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, నాయకులు వీరెళ్లి చంద్రశేఖర్, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, నాగం వర్షిత్‌రెడ్డికి పాపిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ ఐసెట్ షెడ్యూల్ ఆమోదం

నల్లగొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉన్నత విద్యా మండలి వేదికగా జరిగిన సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్, సభ్యులు విశ్వవిద్యాలయ ఉపకులపతులు, సెట్ కన్వీనర్‌లు చర్చించి ఐసెట్ షెడ్యూల్‌ను ఖరారు చేశారని ఐసెట్ కన్వీనర్ ఆచార్య అల్వాల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025 నోటిఫికేషన్ మార్చి 6వ తేదీన విడుదల చేసి జూన్ 8, 9 తేదీలల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జనరల్ అభ్యర్థులు రూ.750, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.550లు దరఖాస్తు రుసుమును ఆమోదించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

(5వపేజీ తరువాయి)

లేకుండా సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు నల్లగొండ సమీపంలోని అర్జాలబావి వద్ద ఉన్న మార్కెటింగ్‌శాఖ గోదాములో ఏర్పాట్లు చేస్తున్నామని, దీనిపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపించామని వివరించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

తొలిరోజు ఒక నామినేషన్

ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన వెంటనే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలి రోజు ఒక నామినేషన్ దాఖలైంది. సూర్యాపేట జిల్లాకు చెందిన లింగిడి వెంకటేశ్వర్లు ప్రజావాణి పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు.

ఎంసీఎంసీ సెంటర్ ప్రారంభం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనలకు ముందస్తు అనుమతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కేంద్రాన్ని రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు వారి ప్రకటనలకు సంబంధించి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని అన్నారు. ఎంసీఎంసీ ద్వారా ప్రతిరోజు వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ప్రచురితమయ్యే చెల్లింపు వార్తలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పర్యవేక్షిస్తామన్నారు. అలాగే మీడియా సెంటర్ ద్వారా ప్రతీ రోజు ఎన్నికలకు సంబంధించిన వార్తలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చేరవేస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీ జె.శ్రీనివాస్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఎంసీఎంసీ సభ్యులు కోటేశ్వరరావు, శేషాచార్యులు, కలెక్టర్ ఏవో మోతీలాల్ పాల్గొన్నారు.


మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి

కాషాయదళంలో 'అధ్యక్ష' దుమారం

(5వపేజీ తరువాయి)

కమిటీ సూచించిన వయో నిబంధనల ప్రకారం వర్షిత్ ఈ పదవికి అనర్హుడని, అదేవిధంగా పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేయడంలో విఫలమయ్యారని వారు ఆరోపిస్తున్నారు. బండారు ప్రసాద్, పోతెపాక సాంబయ్య, కంకణాల నాగిరెడ్డి, దాయం భూపాల్‌రెడ్డి, వంగూరి రాఖీ, దాసరి సాయి, బొజ్జ నాగరాజు, రావిరాల వెంకటేశ్వర్లు, గుర్రం వెంకన్న, పెరికము ని, పులకరి భిక్షం, తదితరులు వర్షిత్‌రెడ్డి నియామకాన్ని బలంగా వ్యతిరేకిస్తున్న వారిలో ఉన్నారు.

అధిష్ఠానం నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
వర్షిత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండో సారి నాకు బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు. నాపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, వారి నమ్మకాన్ని నిలబెడతా. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను విజయపథకంలో నడిపేందుకు కృషి చేస్తా. పార్టీలో నాయకులందరినీ కలుపుకొని జిల్లాలో పార్టీని బలమైన పక్షంగా తీర్చిదిద్దుతా. క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాసమస్యలు, ప్రజావ్యతిరేక రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై క్రియాశీలక పోరాటం కొనసాగిస్తాం.

వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో సురేష్ ప్రతిభ


ధరావత్ సురేష్

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్, పారా ఒలంపిక్ కమిటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలో ఏపీ మెడ్‌టెక్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్లతండాకు చెందిన ధరావత్ సురేష్ ప్రతిభ కనబరిచాడు. ఈనెల 1, 2 తేదీల్లో విశాఖపట్టణంలో నిర్వహించిన పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల జట్లు తలపడ్డాయి. పోటీల్లో తెలంగాణ జట్టు ప్రథమ బహుమతి సాధించింది. తెలంగాణ రాష్ట్ర జట్టు గెలుపొందడంలో ధరావత్ సురేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును సాధించాడు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మండలకేంద్రానికి చెందిన చింతమల్ల వినయ్‌కుమార్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 2న నాగార్జునసాగర్‌లో సీనియర్ నల్లగొండ జిల్లా జట్టు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ సీనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో వినయ్ నల్లగొండ జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనునున్నారు. 2019 డిసెంబరు 11 నుంచి 14 వరకు కర్ణాటకలోని మంగుళూరు యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీల్లో వినయ్ ఎంజీయూ తరపున ప్రాతినిధ్యం వహించి చక్కటి ప్రతిభను కనబరిచాడు.

విద్యార్థులను పట్టించిన ఫోన్‌కాల్

- *శనివారం అర్ధరాత్రి గురుకుల పాఠశాల నుంచి అదృశ్యం*
- *ఆరుగురు విద్యార్థులు విజయవాడకు..*
- *అక్కడినుంచి ఫోన్‌లో తల్లిదండ్రులకు ఫోన్‌కాల్*
- *విజయవాడలో పట్టుకున్న పోలీసులు*

కోదాడ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి టీసీ ఇచ్చి పంపిస్తారనే భయంతో పారిపోయిన సూర్యాపేట జిల్లా కోదాడ గురుకుల పాఠశాల విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. పరారైన విద్యార్థుల్లో ఒకరు తల్లిదండ్రులకు ఫోన్ చేసి విజయవాడలో ఉన్నామని చెప్పడంతో పోలీసులు వెళ్లి వెతికి పట్టుకువచ్చారు. తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోదాడ మండలం దొరకుంట గ్రామశివారులోని పులిచింతల పునరావాస కేంద్రం నెమలిపురి కాలనీలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 500మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నెల 1వ తేదీన 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పెద్దఎత్తున డీజే సౌండ్‌తో విద్యార్థులు ఆడుతూ పాడుతూ నృత్యాలు చేశారు. రాత్రి సమయంలో పాఠశాల పక్కనే ఉన్న బెల్ట్‌షాప్‌నకు ఆరుగురు 10వ తరగతి విద్యార్థులు వెళ్లి మద్యం తాగి వచ్చారు. అనంతరం ఈ ఆరుగురు తోటి విద్యార్థులతో ఘర్షణ పడి కొట్టారు. దీంతో బాధిత విద్యార్థులు వార్డెన్‌కు ఫిర్యాదుచేశారు. వార్డెన్ ఈ ఆరుగురు విద్యార్థులను పిలిచి, వారి వద్ద మద్యం వాసన రావడంతో మందలించి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మూడు నెలల క్రితం మద్యం మత్తులో వివాదం

మూడు నెలల కిందట కూడా ఇదే విద్యార్థులు మద్యం తాగి ఒకరినొకరు కొట్టుకుని ఘర్షణకు పాల్పడ్డారు. వారి తల్లిదండ్రులను మందలించడంతో పాటు మరోసారి ఇలా జరిగితే పాఠశాల నుండి టీసీ ఇచ్చి పంపిస్తామని ప్రిన్సిపాల్ హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు విద్యార్థుల నుంచి హామీ పత్రాలు తీసుకున్నారు. అయినా విద్యార్థుల్లో మార్పు రాలేదు. శనివారం వీడ్కోలు వేడుక ముగిసిన తరువాత మరోసారి మద్యం తాగి వచ్చి విద్యార్థులతో ఘర్షణ పడి కొట్టుకున్నారు. ఈసారి ఎలాగైనా పాఠశాల నుంచి తమను బయటకు పంపుతారని భావించిన విద్యార్థులు శనివారం అర్ధరాత్రి గోడ దూకి పాఠశాల నుంచి పరారయ్యారు. ఆదివారం ఉదయం పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులకు పిల్లలు కనిపించకపోవడంతో వారు వార్డెన్, ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదుచేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా గాలించినా విద్యార్థుల ఆచూకీ లభించలేదు. ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి ఆదివారం రాత్రి 10 గంటలకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పారిపోయిన ఆరుగురిలో ఓ విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లా విజయవాడలో ఉన్నామని చెప్పి ఫోన్ పెట్టేశాడు. వెంటనే ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్, వార్డెన్, పోలీసులు రెండు వాహనాల్లో విజయవాడ వెళ్లి బస్టాండ్, కనకదుర్గమ్మ గుడితో పాటు పలు సినిమా థియేటర్ల వద్ద గాలించి రైల్వేస్టేషన్ వద్దకు వచ్చారు. రైల్వేస్టేషన్‌లో ఈ ఆరుగురు విద్యార్థులు ఉండడం గమనించారు. వీరిని వెంటనే పట్టుకుని సోమవారం తెల్లవారుజామున కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

భయపడి వెళ్లారు..

మద్యం తాగి గొడవ పడిన విషయంలో వార్డెన్ విద్యార్థులను పిలిచి తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపిస్తామని చెప్పడంతోనే ఆందోళనతో వారు పారిపోయినట్లు కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. విషయాన్ని విద్యార్థులు తనకు చెప్పారని ఆయన తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించి, తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పాఠశాల పక్కన బెల్ట్‌షాపును తొలగించాలి

- *విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్*

కోదాడ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల పక్కన ఉన్న బెల్ట్‌షాపును తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలోని దొరకుంట గ్రామ పరిధిలోని పులిచింతల పునరావాస కేంద్రమైన నెమలిపురి కాలనీలో ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల పక్కన బెల్ట్‌షాపు ఉంది. దీంతో రాత్రివేళలో విద్యార్థులు గోడ దూకి వెళ్లి మద్యం తాగుతున్నారని వారు ఆరోపించారు. నెమలిపురి కాలనీలో ఉన్న రెండు బెల్ట్‌షాపులు కూడా నిత్యం మందుబాబులతో కళకళలాడుతుంటాయని వారన్నారు. ఈ విషయాన్ని పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. బెల్ట్‌షాపు నిర్వాహకులు కిరాణ షాపు ముసుగులో పెద్దఎత్తున మద్యం విక్రయిస్తున్నారని వారన్నారు. ఒక్కో విద్యార్థికి డబ్బులు లేకపోయినా మద్యం తాగేందుకు రూ. 2 నుంచి 3 వేల వరకు కూడా అప్పులు పెడుతున్నారని వారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులను పీడించి డబ్బులు తీసుకువచ్చి బెల్ట్‌షాపులకు చెల్లిస్తున్నారని అన్నారు. బెల్ట్‌షాపులను మూసి వేయకపోతే విద్యార్థుల జీవితం నాశనమయ్యే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. గతంలోనూ ఒకసారి విద్యార్థులు మద్యం తాగి కొట్లాడుకున్నారని, అయినా పాఠశాల వార్డెన్, ప్రిన్సిపాల్ పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీని వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీ పేరుతో విద్యార్థుల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు వారి తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు పాఠశాల బయటికి రా కుండా చూడాలని, పాఠశాల పక్కన బెల్ట్‌షాపు తొలగించాలని కోరారు.

వైద్యులు సమయపాలన పాటించాలి : డీఎంహెచ్‌వో


చింతపల్లి: కుర్మపల్లి ఉప కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్

చింతపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్లు సమయపాలన పాటిస్తూ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కుర్మపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపకేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. రోగులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉప వైద్యాధికారి కేస రవి, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, సూపర్‌వైజర్ వెంకటాచారి, ఏఎన్ఎం గాయిత్రీ, తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టుకు 20 ప్రత్యేక బస్సులు

నల్లగొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం నల్లగొండ డిపో నుంచి 20 ప్రత్యేక బస్సులను చెర్వుగట్టుకు నడుపుతున్నట్లు నల్లగొండ ఆర్ఎం జానిరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం స్వామివారి కల్యాణం నేపథ్యంలో బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

గ్యాస్ లీక్.. పానీపూరి బండి దగ్ధం

తుంగతుర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ లీకై మంటలు చెలరేగి పానీపూరి బండి దగ్ధమైంది. ఈ ఘటన తుంగతుర్తి మండల కేంద్రంలో సోమవారం జరిగింది. గిరిజన కుటుంబానికి చెందిన ఆగోతు వీరన్న పానీపూరి బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పానీపూరి చేస్తుండగా గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ మంటలు చెలరేగాయి. ఎలాంటి ప్రాణన ష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

కట్టంగూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ పెంపు కులగణన సర్వే వివరాలను మంగళవారం అసెంబ్లీ సమావేశంలో తీర్మానం పెట్టడంపై ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కట్టంగూరులో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు కొమ్మనబోయిన సైదులు, తండు గిరి, శ్రీను, విజయ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాతగుట్టలో అధ్యయనోత్సవాలు ప్రారంభం

- *7నుంచి 13వ తేదీవరకు వార్షిక బ్రహ్మోత్సవాలు*
- *నేడు రథసప్తమికి యాదగిరిగుట్ట ముస్తాబు*

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట దేవస్థాన అనుబంధ ఆలయం పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 6వ తేదీవరకు అధ్యయనోత్సవాలు, 7నుంచి 13వ తేదీవరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. అధ్యయనోత్సవాల్లో తొలిరోజైన సోమవారం స్వామివారికి, ఆళ్వార్లకు తిరుమంజనాలు చేపట్టిన అర్చకులు దివ్య ప్రబంధ పఠనం చేశారు. సాయంత్రం వేళ తొళక్కంతో దివ్య ప్రబంధ సేవ కాలం పారాయణాలు చేశారు. సేవా కాలంలో తిరుమంజన మహోత్సవం, దివ్య దేశిక వైభవ ప్రకాశిక వేడుక విశిష్టతను ఆచార్యులు వివరించారు. అధ్యయనోత్సవ పర్వాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లంథిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, పాతగుట్ట ఉప ప్రధానార్చకులు భట్టర్ సురేంద్రచార్యులు, కొడకండ్ల మాధవచార్యులు బృందం వేడుకలు నిర్వహించగా ఈవో ఏ.భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఏఈవో దూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకుడు శంకర్‌నాయక్, ఉద్యోగ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజ లు కొనసాగాయి.


దివ్య ప్రబంధ సేవలో పారాయణాలు చేస్తున్న పారాయణికులు

స్వామిని దర్శించుకున్న నేషనల్ డిఫెన్స్ కళాశాల బృందం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం సభ్యులు దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు వేద మండపంలో వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు.



రథసప్తమికి యాదగిరి గుట్ట ముస్తాబు

స్వామివారి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు నిర్వహించేందుకు అధికారులు ఆలయాన్ని సిద్ధం చేశారు. ఆలయంలో అరటి, మామిడి తోరణలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారు ఊరేగే సూర్యప్రభ వాహనాన్ని సిద్ధం చేశారు. తూర్పు రాజగోపురం వద్ద చతుర్వేద పారాయణంతో పాటు రథసప్తమి విశిష్టతను పండితులు వివరిస్తారు. సాయంత్రం స్వామివారిని బంగారు రథంపై ఆలయ అంతః ప్రాకారంలో ఊరేగిస్తారు. వేడుకను పురస్కరించుకుని మంగళవారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు ఆలయంలో నిర్వహించే స్వర్ణ పుష్పార్చనను రద్దు చేశారు.

యాగశాలకు ఏర్పాట్లు

భువనగిరి అర్బన్: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య విమాన గోపురం ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడు వార్షిక బ్రహ్మోత్సవాల నుంచి బంగారు గోపురంగా భక్తులకు కనువిందు చేయనుంది. ఇప్పటి వరకు బంగారు తొడుగుల పనులు శరవేగంగా పూర్తి కావస్తున్నాయి. ఈ నెల 19న బంగారు గోపురాన్ని ప్రత్యేక పూజలు చేపట్టిన తర్వాత 23న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ముందస్తు ప్రకటించినట్లుగా ఈ నెల 19 నుంచి హోమాలు నిర్వహించి 23న సంప్రోక్షణ, మహాకుంభాభిషేకం తదుపరి కళారోహణ నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా ఆలయం ఉత్తర తిరుమాడ వీధిలో సోమవారం సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి స్థలాన్ని గుర్తించి మార్కింగ్ చేశారు. త్వరలో బంగారు గోపురం దర్శించుకునే భాగ్యం భక్తులు కలుగనుంది. ఈ కార్యక్రమాల తర్వాత మార్చి 1 నుంచి 11 రోజుల పాటు నిర్విరామంగా స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహులు

















ఇంటికి వంద- బడికి చందా

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాకగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు వినూత్న పిలుపునకు శ్రీకారం చుట్టారు. స్పార్క్ సంస్థ వ్యవస్థాపకుడు విశ్రాంత ఉపాధ్యాయుడు మామిడి సత్తిరెడ్డి స్ఫూర్తితో గ్రామానికి చెందిన యువకులు ఇంటికి వంద- బడికి చంద అనే నినాదంతో పాఠశాల అభివృద్ధికి పూనుకున్నారు. ప్రతీ నెలా ప్రతీ ఇంటి నుంచి రూ. 100 చెల్లించి పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు 20 మంది గ్రామస్థులు ఇచ్చిన చందా డబ్బులను మాజీ సర్పంచ్ మల్లేశం, కాంగ్రెస్ నాయకుడు మామిడి సుధాకర్‌రెడ్డి సోమవారం అందజేశారు.











ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలుచేయాలి

శాలిగౌరారం, నార్కట్‌పల్లి, మునుగోడు, కనగల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాలోని పలు మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో ఈ నెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతుకలు అనే నినాదంతో చేపట్టనున్న మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శన కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు హలో మాదిగ చలో హైదరాబాద్, లక్ష డప్పుల వేల గొంతుల సభ విజయవంతం చేయాలని కోరారు.

● శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగలు పాదయాత్రతో హైదరాబాద్‌కు బయలుదేరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దేవరకొండ మస్తాన్, నాయకులు మాచర్ల అంజయ్య, వంగూరి శ్రీనివాస్, దేవరకొండ జానయ్య, దేవరకొండ సంపత్, మాచర్ల శ్రీరాములు, గడ్డం శీను, ఊశయ్య, యాదగిరి, దేవరకొండ కృష్ణ పాల్గొన్నారు. సభకు తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం మండల కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు మేడ గోవర్ధన్ తెలిపారు. ఎరుకల కులస్థులంతా సభలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

● నార్కట్‌పల్లిలో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు వేయి గొంతుల కార్యక్రమానికి ఇంటికో బండి మాదిరిగా హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మేడి శంకర్ అన్నారు. ఎల్లారెడ్డిగూడెం మాజీ సర్పంచ్ కొండూరు శంకరయ్య రూ.20 వేల నగదు, 15 డప్పులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చింత శివశంకర్, లింగాల రాములు, మంద సుధాకర్, శం కర్, బండారు రామలింగం, సిర్పంగి స్వామి, ఎల్లయ్య, ముత్తయ్య, చందు, నాగరాజు, రవి, శ్రీను పాల్గొన్నారు. కార్యక్రమంలో దళిత యువకులు పాల్గొన్నారు.

● మునుగోడులో హైదరాబాద్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో లక్ష డప్పులు.. వేల గొంతుకలు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పందుల మల్లేశం, ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీడిమెట్ల రవీందర్, దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్రాల పరమేశం, నాయకులు భీమనపల్లి సైదులు, దుబ్బ విజయ్‌భాస్కర్, పగడాల నాగయ్య, యాదయ్య, నర్సింహ, రాజేష్ పాల్గొన్నారు.

● కనగల్‌లో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కందుల మోహన్‌మాదిగ, సీనియర్ నాయకుడు దుబ్బ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరిచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పందుల గోపాల్, దుబ్బ దేవేందర్, బీరెల్లి నాగరాజు, కొండ నరేందర్, ఆదిమళ్ల సైదులు, వెంకటేశ్వర్లు, రామక్రిష్ణ, శ్రీను, నాగార్జున, అంజయ్య, రవి పాల్గొన్నారు.







బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో తెలంగాణకు తీవ్ర అన్యాయం

శాలిగౌరారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, బొల్లికొండ గణేష్ ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో వివక్షపై నిరసనగా యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలిగౌరారంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మొదట అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, బొల్లికొండ గణేష్, సీనియర్ నాయకులు బండపల్లి కొమరయ్యగౌడ్, చింత ధనుంజయ, వడ్లకొండ పరమేష్‌గౌడ్, తీరుపా మల్లేష్, వేముల గోపినాథ్, జమ్ము అశోక్, అన్నెబోయిన అనిల్, కోక సాయి, వేముల భరత్, సాయి గణేష్, సందీప్, మోషా, అరవింద్ పాల్గొన్నారు.



వైభవంగా బ్రహ్మంగారి కల్యాణం

నల్లగొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చర్లపల్లిలో గల వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో సోమవారం బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు బ్రహ్మంగారి తరపున బ్రాహ్మణచారి నిర్మల, గోవిందాంబ తరఫున సద్గుణాచారి దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి పరవశించిపోయారు. భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు మారోజు శ్రీనివాసచారి, ప్రధాన అర్చకులు శ్రీరామో జు బుచ్చిరామాచార్యులు, సంతోష్, నవీన్, సైదులు, బ్రహ్మచారి, కోటయ్యచారి, వెంకటేశ్వర్లు, నాగార్జున, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

21 సంవత్సరాల తర్వాత కలయిక

శాలిగౌరారం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం జడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న 2003-04


పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 2003-04 బ్యాచ్ విద్యార్థులు

ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు శాలిగౌరారంలోని జీబీఎం ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 21 సంవత్సరాల తర్వాత 160 మంది విద్యార్థులు కలుసుకున్నారు. వారి మధుర జ్ఞాపకాలు స్మరించుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేశారు. వారి గత అనుభవాలు ప్రస్తుతం ఉన్న వారి పరిస్థితిని తెలుపుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురువారావు, కృష్ణారెడ్డి, కుశలవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదమ్మ, వార్డెన్ నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.









అన్ని వర్గాలకు అనుకూలంగా బడ్జెట్

శాలిగౌరారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందని, ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేకనే దిష్టిబొమ్మలు దహనం చేయడం విడ్డూరంగా ఉందని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్ అన్నారు. శాలిగౌరారంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. రైతులకు లాభం చేకూర్చేందుకు ఐదు లక్షల వరకు కిసాన్ కార్డులు ఇస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ మంగడల అధ్యక్షుడు తోట వినోద్‌కుమార్, నాయకులు షేక్ సయ్యద్, ఐతగోని గణేష్, చాడ శ్యాంసుందర్‌రెడ్డి, వెంకన్న, సందీప్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

కట్టంగూరు: కట్టంగూరు మండల కేంద్రంలోని ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు కట్టంగూరులోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానాన్ని ముస్తాబు చేశారు. ఈ నెల 4న గణపతి పూజతో ప్రారంభమయ్యే పూజలు 8వ తేదీన స్వామి వారి ఊరేగింపు, గరుడ ముద్ద, అదే రోజు సాయంత్రం లక్ష్మీనారాయణ స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మనోహర్ తెలిపారు.

ఎస్సీ విభాగం జిల్లా కన్వీనర్‌గా వెంకన్న

నార్కట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా కన్వీనర్‌గా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంలకు చెందిన మేడి వెంకన్న నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన చేసిన మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశానికి కృతజ్ఞతలు తెలిపారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	230
సూర్యాపేట	రూ.131	182	212
నల్లగొండ	రూ.140	194	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 । కనిష్ఠం 18.0



నల్లగొండలో నామినేషన్ దాఖలు చేస్తున్న లింగిడి వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

» తొలి రోజు ఒక నామినేషన్ దాఖలు » ఎంసీఎంసీ సెంటర్ ప్రారంభం

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలి రోజు ఒక నామినేషన్ దాఖలైంది.

నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మీడియాతో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 10 వరకు ఉదయం 11 మధ్యాహ్నం 3గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 8, 9 తేదీల్లో ప్రభుత్వ సెలవు కారణంగా నామినేషన్లు స్వీకరణ ఉండదన్నారు. దాఖలైన మొత్తం నామినేషన్లను ఈనెల 11న పరిశీలిస్తామని, 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు గడువు అని తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ నిర్వహిస్తామని, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు తాను రిటర్నింగ్ అధికారిగా, నల్లగొండ రెవెన్యూ అదనపు కలెక్టర్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తప్పకుండా ఎన్నికల కోడ్‌ను పాటించాలన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గ పరిధిలో మొత్తం 200 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ముసాయిదా జాబితా ప్రకారం 24,905మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ముందస్తు అనుమతి

- మిగతా 7వ పేజీలో...


నామినేషన్ కౌంటర్ 1వ రోజు

తేదీ	దాఖలైన నామినేషన్లు
3న	01
మొత్తం	01



కాషాయం పార్టీలో జిల్లా అధ్యక్షుల ఎన్నికపై దుమారం చెలరేగుతోంది. ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లా అధ్యక్ష పదవులకు కీలకమైన నేతలు పోటీపడుతుండడంతో బాధ్యతలు ఎవరికివ్వాలనే విషయంలో అధిష్ఠాన ముఖ్యులు సైతం డైలమాలో పడ్డారు. వయో నిబంధనలు, రానున్న మూడేళ్లలో పార్టీ కార్యకలాపాలను విస్తృతస్థాయిలో జనంలోకి తీసుకెళ్లడం ద్వారా బలోపేతం చేసే శక్తి, సామర్థ్యాలు, కుల సమీకరణాలను పరిశీలిస్తున్న అధిష్ఠానం జిల్లాల అధ్యక్షుల నియమకంపై తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డిని ప్రకటించగా, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు సంబంధించి నాయకుల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. దీంతో ముఖ్యనేతలు సైతం ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో ఎవరికివ్వాలనే విషయంలో సందిగ్ధం కొనసాగుతుండగా, నాగం వర్షిత్‌రెడ్డి నియామకంపై పార్టీలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



కాషాయదళంలో.. అధ్యక్ష దుమారం



నాగం వర్షిత్‌రెడ్డి

» నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి వర్షిత్‌రెడ్డి
» నాగం నియామకంపై అభ్యంతరాలు
» పెండింగ్‌లో యాదాద్రి, సూర్యాపేట జిల్లాల అధ్యక్షుల నియామకాలు
» బలమైన పోటీతో నిర్ణయానికి రాలేకపోతున్న అధిష్ఠానం

పార్టీ రాష్ట్ర కమిటీ సోమవారం ప్రకటించిన జిల్లాల అధ్యక్షుల జాబితాలో నల్లగొండ అధ్యక్షుడిగా డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి పేరు మాత్రమే ఉండగా, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల అధ్యక్ష పదవులకు పేర్లను పెండింగ్‌లో పెట్టారు. నల్లగొండలోనూ అధ్యక్ష పదవికి తీవ్రపోటీ నెలకొన్నా చివరికి అధిష్ఠానం వర్షిత్‌వైపే మొగ్గింది. సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు తనయుడు సంకినేని వరుణ్‌రావు పేరు ఖరారైందని భావించినా, చివరలో ఆపేశారు. పార్టీ నిబంధనావళి ప్రకారం వయో పరిమితి సరిపోవడం లేదనే విషయం ప్రధాన ఆటంకంగా పేర్కొన్నట్టు సమాచారం. ఈ జిల్లా అధ్యక్ష పదవిని ఈ దఫా సూర్యాపేట పట్టణం లో ఉండి పార్టీలో క్రియాశీలకంగా ఉండే నాయకుల్లో ఎవరికైనా ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌ను నాయకులు అధిష్ఠానం ముందు పెట్టినట్టు తెలిసింది. ఈ జిల్లా అధ్యక్ష పదవికి సంకినేని వరుణ్‌రావు, కడియం రామచంద్రయ్య, బొబ్బ భాగ్యరెడ్డి, చలిగంటి వీరేంద్ర, చల్లా శ్రీలతారెడ్డి, చల్లమల్ల నరసింహ, బూర మల్సూరు గౌడ్, పలుసా మల్సూరుగౌడ్, తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇక్కడ ఎస్సీ సామాజికవర్గనేతకు జిల్లాఅధ్యక్ష పదవి ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించిన నేపథ్యంలో పేరును ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం.

యాదాద్రి జిల్లాలో ఊట్కూరి అశోక్‌గౌడ్, ఏనీరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, ఆలేరుకు చెందిన పడాల శ్రీనివాస్‌గౌడ్, మాయ దశరథ, తదితరులు అధ్యక్ష పదవి ఆశించి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో స్ర్కీనింగ్ కమిటీ ఊట్కూరి అశోక్‌గౌడ్, ఏనీరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి పేర్లను అధిష్ఠానానికి నివేదించగా, సామాజిక సమీకరణాల నేపథ్యంలో అశోక్ గౌడ్‌కు అధ్యక్ష పదవి ఖరారైందని భావించినా, చివరి నిమిషంలో ప్రకటించకపోవడం కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారింది.

వర్షిత్‌రెడ్డి నియామకంపై అభ్యంతరాలు...

నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి రెండోసారి నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు పార్టీ ఎన్నికల అధికారి ప్రకటన విడుదల చేశారు. ఈ సారి అధ్యక్ష పదవి కోసం వర్షిత్‌రెడ్డితో పాటు మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, దోనూరి వీరారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, కడగంచ రమేష్, పిల్లి రామరాజుయాదవ్, తూటుపల్లి రవీందర్ దరఖాస్తు చేసుకున్నారు. స్ర్కీనింగ్ కమిటీ వీరిలో వర్షిత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రమేష్ పేర్లను అధిష్ఠానానికి సూచించింది. రాష్ట్ర స్థాయి సమీకరణాల్లో భాగంగా వర్షిత్‌నే మరోదఫా అధ్యక్షుడిగా కొనసాగించాలని అధిష్ఠానం నిర్ణయించి ప్రకటించింది. అయితే వర్షిత్ నియామకాన్ని వ్యతిరేకిస్తున్న నాయకులు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఈ నియామకాన్ని వ్యతిరేకిస్తున్నామని, దీనిపై అధిష్ఠానం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. అధిష్ఠానం స్పందించకుంటే పార్టీ కార్యకలాపాలకు తాము దూరంగా ఉండాల్సి ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కేంద్ర...

- మిగతా 7వ పేజీలో...

పనుల జాతర

» ఖరారైన వార్షిక లక్ష్యం
» ఉమ్మడి జిల్లాలో 7.65లక్షల జాబ్‌కార్డులు
» 15.98లక్షల మంది కూలీలకు 1.85కోట్ల పనిదినాలు
» నిధుల అంచనా రూ.560కోట్లు



వేములపల్లి చెరువులో పూడికతీత పనులు చేపడుతున్న ఉపాధి కూలీలు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 3: గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను నియంత్రించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం కింద వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూలీలకు అత్యధిక పని దినాలు కల్పించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పిస్తూ 2025-26 ఆర్థిక సంవత్సర ప్రణాళిక ఖరైంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,85,44,021 పని దినాలను అధికారులు ఆమోదించారు. ఈ పనుల పూర్తికి దినసరి కూలీరేటు రూ.302 చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.560 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. దీంతో ఈ ఏడాది వేసవిలో గ్రామీణ ప్రాంత కూలీలకు అత్యధిక పనిదినాలు లభించనున్నాయి. ● 6లో..

● పాతగుట్టలో అధ్యయనోత్సవాలు ప్రారంభం



పాతగుట్టలో పూజలు నిర్వహిస్తున్న పండితులు ● 7లో..

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష

డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా ప్రభుత్వం వివక్ష చూపించిందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా టీపీసీసీ పిలుపు మేరకు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం క్లాక్ టవర్ సెంటర్‌లో పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్ కేటాయింపులో తెలంగాణపై వివక్ష చూపించిందని ధ్వజమెత్తారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఎక్కువ బడ్జెట్ కేటాయించిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయించకుండా పక్షపాతం చూపిందన్నారు. కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల, మతాల పేరుతో విడదీస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు, పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని అన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి వేల కోట్ల పన్నులు తీసుకొని బడ్జెట్లో తెలంగాణకి కేటాయించింది గుండు సున్నా అని అన్నారు. మోదీ మూడు సార్లు ప్రధాని అయినా పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి నిధులు కేటాయించాలనప్పటికీ కేంద్రం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా కక్షపూరితంగా వ్యవహరి స్తోందని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జూకురి రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, ప్రాంతీయ రవాణా శాఖ డైరెక్టర్ కుసుకుంట్ల రాజిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు గడిగ శ్రీను, బొజ్జ శంకర్, సమద్, కత్తుల కోటి, ఖలీల్, ఇంతియాజ్ హుస్సేన్, పోలే జయకుమార్, అల్లి సుభాష్‌యాదవ్, ఎండీ. ఇంతియాజ్, దుబ్బ అశోక్ సుందర్, బీరం కరుణాకర్‌రెడ్డి, ఇటికాల శ్రీనివాస్, ఇబ్రహీం, గురిజ వెంకన్న, వజ్జ రమేష్ యాదవ్, జూలకంటి వెంకట్, పుట్టా రాకేష్, వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పీఎం మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు గుమ్ముల మోహన్‌రెడ్డి, తదితరులు

విద్యార్థినులు అన్ని అంశాల్లో ప్రతిభ కనబర్చాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ విద్యాలయాల విద్యార్థినులను విద్య, క్రీడలు, అన్ని అంశాల్లో రాణించేందుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కేజీబీవీల సూచించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమా వేశంలో ఆమె మాట్లాడారు. కేజీబీవీలోని విద్యార్థుల ఆహారం, విద్య, నిర్వహణ, తదితర అన్ని అంశాల్లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. జేఈఈ మెయిన్స్, ఎన్ఐటీ, నీట్ తదితర ఎంట్రన్స్ పరీక్షలకు వారిని సన్నద్ధం చేయాలన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు కోచింగ్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి ఐదుగురు విద్యార్థినులకు సైన్స్ ఎక్స్పోలకు తీసుకవెళ్లే విధంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. కేజీబీవీల అంతర క్రీడా పోటీలతోపాటు, జోనల్ స్థాయిలో నిర్వహించే క్రీడల్లో విద్యార్థినిలు ప్రతిభ కనబరిచే విధంగా తయారు చేయాలన్నారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఈవో భిక్షపతి, జీసీడీవో సరిత ఉన్నారు.

● భక్తి శ్రద్ధలతో వసంత పంచమి



నల్లగొండలో వసంత పంచమి సందర్భంగా చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న దంపతులు

మొదటి రోజే భారీగా గైర్హాజరు

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం ● 6లో..

నియమావళికి విరుద్ధంగా అధ్యక్షుడి నియామకం

బీజేపీ నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండారు ప్రసాద్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ నియమావళిని ఉల్లంఘించి జిల్లా అధ్యక్ష నియామకం జరిగిందని, దీనిపై కేంద్ర నాయకత్వం పునరాలోచించాలని బీజేపీ నల్లగొండ పార్లమెంటరీ కన్వీనర్ బండారు ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒంటెద్దు పోకడలతో క్రియాశీల సభ్యత్వం లేని వారిని అధ్యక్షుడిని ఎలా చేస్తారని ప్రశ్నించారు. 11 నెలలుగా జిల్లా అధ్యక్షుడిగా ఉండి పేమెంట్ కార్యకర్తలతో నడిపిస్తూ, పార్టీని భ్రష్టు పట్టించిన వ్యక్తికి మరోసారి పదవి ఎలా ఇస్తారన్నారు. వర్షిత్‌రెడ్డి నియామకాన్ని జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, వారి అభిప్రాయం తీసుకోకుండా ఎలా నియామకం చేస్తారని ప్రశ్నించారు. క్రమశిక్షణ ఉన్న కార్యకర్తగా, నాయకుడిగా బీజేపీ నిబంధనలకు కట్టుబడి పనిచేశానని తొలిసారి పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించడం బాధగా ఉందన్నారు. బూతు కార్యకర్తలు, మండల పార్టీ నాయకులు, జిల్లా నాయకులు అభిప్రాయం తీసుకోకుండానే నియామకం చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

అధ్యక్షుడిని మార్చకుంటే కార్యాలయానికి వచ్చేది లేదు

పార్టీ రాష్ట్ర నాయకత్వం అధ్యక్ష నియామకంపై పునరాలోచన చేయాలని అన్నారు. పార్టీ అధ్యక్ష మార్పు జరిగేంతవరకు పార్టీ కార్యాలయ మెట్లు ఎక్కేది లేదని స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తామని, అయినా పట్టించుకోకపోతే తామంతా ఒక నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని, ఆ పరిస్థితి రాకుండా చూడాలన్నారు. బీజేపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతెపాక సాంబయ్య మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అర్ధరాత్రి నియామకం జరిగిందని, మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం తీసుకోలేదని, పార్టీ కేంద్ర నాయకత్వం పునరాలోచన చేయాలని అన్నారు. సీనియర్ కార్యకర్తలను పక్కనపెట్టి పార్టీని భ్రష్టు పట్టిస్తున్న వ్యక్తికి అధ్యక్ష పదవి ఎలా కట్టబెడతారన్నారు. తనతో కలిసి రాకపోతే ప్రస్తుత కౌన్సిలర్లతోపాటు, కౌన్సిలర్ టికెట్ ఆశిస్తున్న వారికి టికెట్ ఇచ్చేది లేదని బెదిరిస్తూ పార్టీకి నష్టం చేసే చర్యలు చేపడుతున్నాడని అన్నారు. అలాంటి వ్యక్తి అధ్యక్షుడిగా కొనసాగితే ఇప్పుడిప్పుడే జిల్లాలో పుంజుకుంటున్న పార్టీ అధోగతి పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు కంకణాల నాగిరెడ్డి, దాసరి సాయి, వంగూరు రాఖి, గుర్రం వెంకన్న, రావిరాల వెంకటేశ్వర్లు, గడ్డం వెంకట్‌రెడ్డి, వినయ్‌కుమార్, ఈశ్వర్, బద్దం నగేష్, అక్కినపల్లి బలరాం, బొజ్జ నాగరాజు, మధు, పెరిక నరసింహ, పెరిక మునికుమార్, ముత్యాల శంకర్‌రెడ్డి, పవన్, ఏరుకొండ హరి, సముద్రాల వెంకట్, ప్రసాద్ భిక్షం, తదితరులు పాల్గొన్నారు.




జోన్‌ల వారీగా సిబ్బందికి డ్యూటీలు కేటాయిస్తున్న అధికారులు

చెర్వుగట్టు జాతరలో 530 మందితో పారిశుధ్య సేవలు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు జాతర సందర్భంగా 530మందితో పారిశుధ్య సేవలు అందించనున్నారు. చెర్వుగట్టు గ్రామాన్ని మొత్తం 10 పారిశుధ్య జోన్లుగా, ఎనిమిది తాగునీటి జోన్లుగా విభజించారు. ప్రతిరోజూ మూడు షిఫ్టుల ప్రకారం సిబ్బంది అందుబాటులో విధులు నిర్వహించనున్నారు. జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షణలో ఆరుగురు ఎంపీడీవోలు, ముగ్గురు డీఎల్‌పీవోలు, 10 మంది ఎంపీవోలు, 90మంది పంచాయతీ కార్యదర్శులు వారం రోజుల పాటు జాతర విధుల నిర్వహించనున్నారు. 411 మంది పారిశుధ్య సిబ్బంది మూడు షిఫ్టుల్లో సేవలందించే విధంగా ఏర్పాట్లు చేశారు. వీరిలో 75 మంది గ్రామపంచాయతీ వర్కర్లు కాగా, మిగతా 336మంది దినసరి కూలీలను నియమిస్తారు.

ఎప్పటికప్పుడు చెత్త ఎత్తివేసేలా ఎనిమిది ట్రాక్టర్లు, ఎనిమిది జోన్లలో తాగునీటిని నిరంతరం సరఫరా చేసేలా 10 ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. ఈ సారి మూడు మొబైల్ టాయిలెట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో మొబైల్ టాయిలెట్లలో 10 బ్లాకులుంటాయి. జాతర ముగిసే వరకు ప్రతిరోజూ సుమారు 550 నుంచ 600 మందికి మూడు పూటలా ఆహారాన్ని సరఫరా చేసేందుకు టెండర్ ద్వారా ఏర్పాటు చేశారు.



మోత్కూరులో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, పైళ్ల సోమిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటుచేయాలి

మోత్కూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సామేలు కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్న నాయకులను, ఆయన గెలుపు కోసం పని చేసిన వారిని పక్కనపెట్టి, బీఆర్ఎస్ నుంచి వచ్చి పార్టీ కండువా కప్పుకున్న వారిని ప్రోత్సహిస్తున్నారని, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటుచేసేంతవరకు తాము పోరాడుతామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యానారాయణ, పలువురు కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. సోమవారం యాదాద్రి జిల్లా మోత్కూరులో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి సన్మాన సభలో వారు మాట్లాడారు. ముందుగా ప్రీతం మాట్లాడుతూ, 35 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసి, ఈ ప్రాంతంలో పార్టీని, కార్యకర్తలను కాపాడిన పైళ్ల సోమిరెడ్డికి వాస్తవంగా నామినేటెడ్ పోస్టు రావాలని, అది ఇవ్వలేనప్పుడు పార్టీ పదవి ఇస్తే జీర్ణించుకోలేకపోతే ఎలా అని ప్రశ్నించారు. కార్యకర్తల జోలికి వస్తే పదవిని పక్కన బెట్టి వారికి అండగా నిలుస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ ఇస్తారో లేదోనని భయపడవద్దని అన్నారు.

పైకం రాదు.. పని సాగదు

● అసంపూర్తిగా ఆరోగ్య ఉప కేంద్రాలు ● నిధుల జాప్యంతో నత్తనడకన పనులు ● అద్దె భవనాల్లో సిబ్బంది అవస్థలు



సల్కునూరులో స్లాబ్ లెవల్‌లో నిలిచిపోయిన ఆరోగ్య ఉప కేంద్రం పనులు

వేములపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు గ్రామాల్లో నిర్మిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రాలు(పల్లె దవాఖానాలు) నిధుల జాప్యంతో మధ్యలోనే ఆగిపోతున్నాయి. దీంతో అద్దె భవనాల్లో సరైన వసతులు లేక సిబ్బంది ప్రజలకు సేవలందిచాల్సి వస్తోంది. గత ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా 2022-23 సంవత్సరంలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయించింది. మండల పరిధిలో వేములపల్లి, శెట్టిపాలెం, మొల్కపట్నం, సల్కునూరు, రావులపెంట గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి నిర్మాణాలు చేపట్టారు. కొన్ని నెలలుగా సకాలంలో సరైన నిధులు విడుదల కాక నిర్మాణాల్లో తీవ్ర జాప్యం నెలకొంటుంది. వేములపల్లి, శెట్టిపాలెం, రావులపెంట గ్రామాల్లో ఉపకేంద్రాల నిర్మాణాలకు మొదటి విడత రూ.7లక్షల చొప్పున విడుదల కావడంతో స్లాబ్ పూర్తయి గదుల నిర్మాణ పనులు జరిగాయి. సల్కునూరు, మొల్కపట్నం ఉపకేంద్రాలకు ఇంతవరకు నిధులు విడుదల కాకపోవడంతో సల్కునూరు ఆరోగ్య ఉపకేంద్రం స్లాబ్ లెవల్‌లో పనులు ఆగిపోగా మొల్కపట్నం ఆరోగ్య ఉప కేంద్రం పిల్లర్ల స్థాయిలోనే కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. దీంతో గ్రామాల్లో కొనసాగుతున్న అద్దె భవనాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో సరైన వసతులు లేక, ఇటు సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

అద్దె అందక సిబ్బంది అవస్థలు

గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఆయా గ్రామాల పరిధిలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణ కోసం ప్రభుత్వం నెలకు ఒక్కో ఉప కేంద్రానికి సుమారు రూ.1200 చొప్పున అద్దె అందిస్తుంది. మూడు సంవత్సరాలుగా అద్దె నిధులు విడుదల చేయకపోవడంతో స్థానికంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అద్దె అరకొరగా చెల్లిస్తుండడంతో గ్రామాల్లోని ఉప కేంద్రాల నిర్వహణ సరైన వసతులు లేక రోగులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్య ఉపకేంద్రాలకు వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం సకాలంలో పూర్తి చేస్తే పూర్తిస్థాయి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తే రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందే అవకాశం ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.

సకాలంలో నిర్మాణం పూర్తి చేయాలి



గ్రామంలో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రానికి అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేసి నిర్మాణాన్ని పూర్తి చేసి గ్రామస్థులకు అందుబాటులోకి తేవాలి. సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ అద్దె భవనాల్లో సరైన వసతులు లేక వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వైద్యరంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తక్షణమే విడుదల చేసినట్లయితే ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేందుకు అవకాశం ఉంటుంది.

● జెర్రిపోతుల గిరిబాబు, మొల్కపట్నం

నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం

ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వేములపల్లి, శెట్టిపాలెం ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. మిగిలిన మూడు ఆరోగ్య ఉప కేంద్రాలకు సకాలంలో నిధులు అందేలా చర్యలు చేపట్టి వాటిని సైతం పూర్తయ్యేలా చూస్తాం.

● ఆదినారాయణ, పీఆర్ డీఈ.

చదివిన పాఠశాలకు వసతులు కల్పిస్తాం



పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాలకు కావాల్సిన వసతుల కల్పనకు సహకరిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. 1975వ సంవత్సరంలో చదివిన విద్యార్థులు 50ఏళ్ల తర్వాత సోమ వారం పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరించారు. ఎంఈవో బాలునాయక్, చెన్నూరి రంగారావు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల బలోపేతానికి సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం వి. శ్రీనివా‌స్‌రావు, పూర్వ విద్యార్థులు చిమట మదార్‌యాదవ్, బొప్పన శ్రీనివాస్‌రావు, తుమ్మలూరి నాగార్జునరెడ్డి, కృష్ణమూర్తి, అనం తలక్ష్మీ, పుష్ప, జానకమ్మ, శశికళ, సుశీల, రంగారెడ్డి, జయవాణి, లక్ష్మీమనోహరి పాల్గొన్నారు.

'డీఈవోపై విచారణ జరిపించాలి'

దేవరకొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డీఈవో బొల్లారం బిక్షపతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తూటుపల్లి రవికుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారికి సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డీఈవో బిక్షపతి 2019 నుంచి నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారిగా కొనసాగుతూ అక్రమ డిప్యూటేషన్‌లను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ కార్యాలయం అక్రమ డిప్యూటేషన్లకు నిలయంగా మారిందని ఆరోపించారు. గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు సంవత్సరాలుగా ఆఫీసులో తిష్ట వేసుకొని కూర్చున్నారని ఆరోపించారు. జిల్లాలో అక్రమ డిప్యూటేషన్‌లపై 2023 ఆగస్టులో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. అక్రమ డిప్యూటేషన్‌ల విషయంలో లోకాయుక్తా తెలంగాణలో రెండు ఫిర్యాదులు ప్రస్తుతం విచారణలో ఉన్నాయని పేర్కొన్నారు. చాలామంది ఉపాధ్యాయులు అక్రమ డిప్యూటేషన్‌లు పొంది జీతాలు ఒక చోట, డ్యూటీలు ఒకచోట చేస్తున్నారని, ఎలాంటి ఉత్తర్వులు లేకున్నా హెచ్‌ఎంలు టీచర్లను ఎలా జాయిన్ చేసుకుంటున్నారని ప్రశ్నించారు.

నూతన జాతీయ విద్యా విధానం సరికాదు

దేవరకొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న జాతీయ నూతన విద్యా విధానం రాజ్యాంగ స్ఫూర్తికి ప్రమాదకరమని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు అన్నారు. దేవరకొండలో సోమవారం సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న జాతీయ విద్యా విధానం విద్యా వ్యవస్థకే గొడ్డలిపెట్టు అని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ఆరు శాతం నిధులు కూడా కేటాయించకుండా విద్యారంగాన్ని ఎలా పరిరక్షిస్తారని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9, 10వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు సురిగి వినయ్, డివిజన్ కార్యదర్శి షేక్ శంషోద్దిన్, శివకుమార్, స్వాతి, సిద్ధార్థ, భాను, హరీష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతరను విజయవంతం చేయాలి

పెద్దవూర, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకుడుచెట్టుతండా పరిధిలోని బోనూతల గ్రామంలో ఈ నెల 12 నుంచి నిర్వహించే తిరుమలనాథ స్వామి జాతరను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సోమవారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి జాతర, కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కల్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : భగత్



కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హాలియాలోని 1వ వార్డు ఇబ్రహీంపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త లింగా సత్యం రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పార్టీ తరుపున మంజూరైన రూ.2లక్షల ఇన్సురెన్స్ చెక్కును సోమవారం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, నాయకులు యడవల్లి మహేందర్‌రెడ్డి, చాపల సైదులు, సురభి రాంబాబు, చాపల వెంకన్న, చాపల మహేష్, జాల సైదులు, నాదెండ్ల నర్సింహ, గోగు అచ్చాలు, గోగు నవీన్, నల్లబోతు బాలయ్య, లింగాల రాంబాబు, మహేష్, శంకర్, నల్లబోతు కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి'

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపల్లి: బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నాగం వర్షిత్‌రెడ్డిని సోమవారం సన్మానించారు. అవినీతి రహిత పరిపాలన అందించేందుకు మోదీ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలి



నాగార్జునసాగర్‌లో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వెయ్యి గొంతులు, లక్ష డప్పులతో ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సంఘం ఆధ్వర్యంలో సాగర్ హిల్ కాలనీ నుంచి బస్టాండ్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహా నికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అడెపు నాగార్జున, వీరబాబు, నకుల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హాలియా: మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఈ నెల 7వ తేదీన హైద రాబాద్‌లో జరిగే లక్షల డప్పుల వేల గొంతుల మహా ప్రదర్శన పోస్టర్‌ను ఎమ్మా ర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గడుసు సైదీష్‌మాదిగ ఆధ్వర్యంలో సోమవారం హాలియాలో ఆవిష్కరించారు. ఎస్సీల వర్గీకరణ చేయకుండా మాదిగలకు అన్యాయం చేయొద్దన్నారు. మాదిగల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరా రు. కార్యక్రమంలో సంఘం నాయకులు గార్లపాటి ప్రసాద్, బూడిద విజయ్, బందిలి చినసైదులు, నకిరేకంటి సైదులు, గార్లపాటి చినశేఖర్, ఉద్యోగ సంఘ నాయకులు మామిడి శంకర్, గార్లపాటి శ్రీనివాస్, తక్కెళ్లపల్లి సైదులు, యడవల్లి రంజిత్, విజయ్, హథు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం : సీపీఎం



వేములపల్లిలో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

వేములపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. కేంద్ర బడ్జెట్ తీరును నిరసిస్తూ సోమవారం మండలకేంద్రంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి మాట్లాడారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నా బడ్జెట్‌లో సరైన నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకే ఎక్కువ నిధులు కేటాయించి బీజేపీయేతర రాష్ట్రాలకు నిధుల కేటాయింపులు చేయకపోవడం వివక్షకు గురి చేయడమన్నారు. రాష్ట్రంలోని బీజేపీ మంత్రులు ఇప్పటికైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణకు అవసరమైన నిధులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, వడ్డెగాని సైదులు, అనిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పుట్టల సైదులు, మహేందర్ రెడ్డి, వీరయ్య, వెంకటేశ్వర్లు, నారాయణ, వెంకన్న, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బీజేపీ పాలిత రాష్ట్ర ప్రాంత బడ్జెట్‌గా ఉందని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు మేలు చేసే విధంగా ఉందన్నారు. వ్యవసాయం, ఉపాధి హామీ, విద్యా, వైద్య రంగానికి సరైన కేటాయింపులు జరగలేదన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఒక్క పైసా కూడా కేటాయింపులు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పాపానాయక్, దయానంద్, కోటిరెడ్డి, ఎర్రనాయక్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరకు నిధుల విడుదల హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పెద్దగట్టు(దురాజ్‌పల్లి) జాతరలో వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.5 కోట్ల నిధుల విడుదల చేయడం హర్షణీయమని యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు పగిడి రామలింగయ్య యాదవ్ అన్నారు. పట్టణంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 16న జాతర ప్రారంభమై 20వ తేదీన ముగుస్తుందన్నారు. తెలంగాణలో రెండో అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన ఈ జాతరకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు. మొక్కితే వరమిచ్చే లింగన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ నిధులతో అధికార యంత్రాంగం అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. నిధుల మంజూరులో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి చొరవ చూపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ యాదవ సంఘం కట్టెబోయిన శ్రీనివాసయాదవ్, నాయకులు ఈ డీబీఆర్ యాదవ్, చిమట శ్రీనివాస్‌యాదవ్, పొదిల వెంకన్నయాదవ్, గంగుల బిక్షంయాదవ్, కొర్రపిడత సురేష్, జంగా లక్ష్మణ్‌యాదవ్, ఊరుబండి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పీఏపల్లి : కల్యాణంలో పాల్గొన్న భక్తులు



చింతపల్లి: పూజల్లో పాల్గొన్న భక్తులు

దేవాలయాల్లో ఆధ్యాత్మిక సందడి



హాలియా : పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

చింతపల్లి, హాలియా, పెద్దఅడిశర్లపల్లి, నాంపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సరస్వతీ పూజలు నిర్వహించారు. చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్) శివాలయంలో భక్తులు పూజలు చేశారు. హాలియాలోని శివాలయంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ దేవాయాలు ఆధ్యాత్మికతకు నిలయాలుగా ఉంటాయన్నారు. ఎమ్మెల్యేతో పాటు, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మేడారంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితులు సూర్యనారాయణమూర్తి బృందంచే హోమం పూజ, గణపతిపూజ నిర్వహించారు. ఈ కల్యాణంలో 680 జంటలు పాల్గొన్నాయి. నాంపల్లి మండలంలోని తుమ్మలపల్లిలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆకునూరి నాగలక్ష్మీ, పార్వతమ్మ పాల్గొన్నారు.



చింతపల్లి సాయిబాబా ఆలయంలో అక్షరాభ్యాసంలో పాల్గొన్న భక్తులు



హాలియాలోని శివాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

రోడ్ల నిర్మాణానికి రూ.10కోట్లు మంజూరు

దేవరకొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీలకు రోడ్డు నిర్మాణానికి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10 కోట్లు మంజూరైనట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాల్లోని ఎస్సీ కాలనీలకు నూతన రోడ్లు, మరమ్మత్తులు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఎస్సీ కాలనీల్లోని రోడ్లకు కేటాయించి అభివృద్ధి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడకమళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుతపమ్మ దేవాలయానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అంగరంగ వైభవంగా వేదమంత్రోచ్చరణల నడుమ భూమిపూజ నిర్వహించారు. గ్రామ పూజారి బవాని శంకర్‌శర్మ ఆధ్వర్యంలో తిరుపతమ్మ మాలధారణ భక్తులచే భజన కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్న ప్రభుత్వం

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బీసీలపై రాష్ట్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమను చూపిస్తోందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిడిగం నాగయ్య ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ బీసీ జనాభాపై ప్రభుత్వం తప్పుడు సర్వే లెక్కలు మానుకోవాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీల జనాభా 52శాతం ఉండగా ప్రస్తుతం కుల గణనలో కేవలం 46శాతం ఉన్నట్లు చూపించడం తగదన్నారు. ఇప్పటికే ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లతో బీసీలు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పుడు ప్రభుత్వ తప్పుడు లెక్కలతో బీసీలు మరింత నష్టపోయే అవకాశం ఉందన్నారు. బీసీలకు అన్యాయం చేస్తే వచ్చే ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని, మరో ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

చింతపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధికి సహకరించాలని గొడుకొండ్ల పంచాయతీ కార్యదర్శి జర్పుల పద్మ అన్నారు. మండలంలోని వెంకటేశ్వర నగర్(మాల్)లో సోమవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధన్యాత కల్పిస్తే ఎలాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉండదని తెలిపారు.

8న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

హాలియా, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీలోని గోవిందమాంబ దేవి సమేత మద్విరాట్ శివవీర బ్రహ్మేంద్రస్వామి 20వ వార్షికోత్సవ కల్యాణ బ్రహ్మోత్సవాలను ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు చెన్నోజు మోహనాచారి, కార్పెంటర్ యూనియన్ సంఘం అధ్యక్షుడు కాతోజు ఎల్లచారి తెలిపారు. బ్రహ్మోత్సవ కరప త్రాలను సోమవారం ఆలయంలో విడుదల చేశారు. 7వ తేదీ సాయంత్రం మంగళ తోరణం, గణపతి పూజ, పుణ్యాహవానం, కంకణధారణ, అంకురారోహణ, మంత్ర పుష్పం, తీర్థప్రసాదాలు, 8వ తేదీ సుప్రభాతసేవ, గణపతి పూజ, విష్ణుసహస్రనామ పారాయణం, కల్యాణ మూర్తులకు పంచామృత అబిషేకాలు, బిందెతీర్థం, ఎదుర్కోలు, 9గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి గొట్టె ముక్కల నర్సింహాచార్యులు, కటకం మురళిచారి, కటకం సాంబయ్యచారి, దారోజు శ్రీనివాసచారి, చేపూరి కొండలాచారి, సత్యాచారి, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో నాణ్యమైన విద్య

గుర్రంపోడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ గురుకులాల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ ఫారూక్ అన్నారు. మండలంలోని పిట్టలగూడెంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో విద్యార్థులకు కాస్మోటిక్ కిట్లు, ప్లేట్లు, షూస్ అందజేశారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మన్న వేణు గోపాల్, అతియా అంజుం, శ్రీలత, హెల్త్ సూపర్‌వైజర్ చిరుమర్తి శ్రీనయ్య, డిప్యూటీ వార్డెన్ షేక్ సయ్యద్ మియా, రాజు, మర్రెడ్డి శ్రీలత ఉన్నారు.

నేటినుంచి బ్రహ్మోత్సవాలు

గుర్రంపోడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలం మొసంగి గ్రామంలో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్, దేవాలయ భక్తుడు గోలి వెంకటేశ్వర్లు లలిత అన్నారు. 4న తోరణోత్సవం అభిషేకం, యజ్ఞం, హోమం పూర్ణాహుతి, ప్రభల ఊరేగింపు, భజ నలు కోలాటాలు, 5న స్వామివారి కళ్యాణం పాలాబిషేకం, ఎల్లమ్మ బోనాలు, బాల నాగమ్మ నాటకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.